




నిత్యకల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

రామయ్యకు అభిషేకం

- వేడుకగా నిత్యకల్యాణం

భద్రాచలం, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : భద్రాచలం సీతారామచంద్రస్వామి వారికి బుధవారం అభిషేకం నిర్వహించారు. అలాగే బేడా మండపంలో స్వామి వారి నిత్యకల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు, వేద ఆశీర్వచనం తదితర కార్యక్రమాలు, పూజలను వైదిక బృందం ఘనంగా నిర్వహించింది.



ఆలయ ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న ఈవో

జమలాపురం ఆలయంలో వన మహోత్సవం

ఎర్రుపాలెం, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ఎర్రుపాలెం మండలం జమలాపురం శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం ధార్మిక భవనం ఆవరణలో బుధవారం ఆలయసిబ్బంది మొక్కలు నాటారు. దేవాదాయశాఖ కమిషనర్ ఆదేశాలతో ఈవో కొత్తూరు జగన్మోహన్ రావు అర్చకులు, సిబ్బందితో కలిసి మారేడు, రాగి, ఉసిరి, మామిడి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ ఆలయ ప్రాంగణమంతా పచ్చద నం విస్తరింపజేయాలన్న లక్ష్యంతో మొక్క లు పెంచే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. ఆలయానికి వచ్చేభక్తులకు ఆహ్లాదం కలిగించేందుకు పరిసరాలను తీర్చిదిద్దుతున్నామని, దేవ వృక్షాలు, మహావృక్షాలుగా ఎదిగే జాతి మొక్కలు ఆలయ పరిసరాల్లో నాటేందుకు భక్తులకు కూడా ఈ అవకాశం కల్పిస్తున్నామన్నారు.



మీన మేదీ?

- ఈ ఏడాది ఉచిత చేపపిల్లల సరఫరా లేనట్టేనా!
- అసలు ఊసేలేని రొయ్యపిల్లల పంపిణీ
- జూలై వచ్చినా టెండర్లు పిలవని ప్రభుత్వం
- ప్రతిపాదనలు పంపినా లభించని మోక్షం
- గతేడాది రెండు దఫాల్లో విత్తనపిల్లల సరఫరా

మత్స్యకారుల అభ్యున్నతే లక్ష్యంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఉచితంగా చేపపిల్లల పంపిణీ పథకానికి శ్రీకారం చుట్టగా.. పోయిన ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కారు ఆ కార్యక్రమాన్ని కొనసాగిస్తోంది. గతేడాది చేపపిల్లల సరఫరా జరిగినా అదీ అత్తెసరుగానే జరిగిందన్న విమర్శలున్నాయి. ఈ క్రమంలో అసలు ఈ ఏడాది ఈ పథకం వర్తింపుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మే, జూన్ నెలల్లోనే టెండర్లు పిలవాల్సి ఉండగా.. జూలై వచ్చినా ఆ దిశగా ఎలాంటి ప్రకటనలు, చర్యలు లేకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఇదిలా ఉంటే గతేడాదే రొయ్యపిల్లల సరఫరా ఊసు లేకపోవడం పట్ల ఆక్షేపణలు వ్యక్తమువున్నాయి.

వైరా, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందించే చేపపిల్లల కోసం మత్స్యకారులు ఎదురుచూస్తున్నారు. వాస్తవానికి మే, జూన్ నెలల్లోనే టెండర్లు ఆహ్వానించి చేపపిల్లల సరఫరా దారులతో ఒప్పంద ప్రక్రియను పూర్తిచేయాల్సిన ప్రభుత్వం.. జూలై నెల వచ్చినా ఇంతవరకు ఆ దిశగా ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో అసలు ఈ పథకాన్ని కొనసాగిస్తున్నారా? లేదా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో బీఆర్ఎస్ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ఏటా ఉచిత చేపపిల్లలను సరఫరా చేయగా.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత పథకాన్ని కొనసాగించినా.. గతేడాది అత్తెసరుగా చేపపిల్లలను సరఫరా చేసిందని, ఇక రొయ్యపిల్లల సరఫరాను పూర్తిగా విస్మరించిందన్న విమర్శలున్నాయి. మత్స్యశాఖ అధికారులు రొయ్యపిల్లల సరఫరా కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించినా అవి బుట్టదాఖలయ్యాయన్న అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఈ ఏడాది ఖమ్మంజిల్లాలోని నాలుగు రిజర్వాయర్లు, 272చెరువులు, 600కుంటలు, చెరువులు మొత్తం 876నీటివనరుల్లో 3.59కోట్ల ఉచిత చేపపిల్లల కోసం జిల్లా మత్స్యశాఖ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. కానీ ఇంతవరకు ఆ ప్రతిపాదనలకు మోక్షం లభించలేదు.

ఇప్పటికే టెండర్లు ఆహ్వానించాల్సి ఉన్నా...

బీఆర్ఎస్ హయాం నుంచి ఉచిత చేపపిల్లలు, రొయ్యపిల్లల సరఫరాదారుల నుంచి మే, జూన్ నెలల్లోనే టెండర్లు ఆహ్వానించి.. ఒప్పంద ప్రక్రియ కూడా పూర్తిచేసేవారు. ఆతర్వాత సెప్టెంబరు, అక్టోబరు నుంచి నీటివనరుల్లో ఉచిత చేపపిల్లలను పోయడం ప్రారంభించి ఒక ట్రెండు నెలల్లో ప్రక్రియను పూర్తిచేసేవారు. అయితే ఈ ఏడాది జూలై వచ్చినా రాష్ట్రస్థాయిలోనే ఇంతవరకు ఉచిత చేపపిల్లలకు సరఫరాకు సంబంధించి టెండర్లను ఆహ్వానించలేదు. దాంతో కాలాతీతమైనందున ఉచిత చేపపిల్లల సరఫరా ఈ ఏడాది ఇక లేనట్లేనని మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు.

ఖమ్మం జిల్లాలో గతేడాది పరిస్థితి...

గతేడాది ఖమ్మంజిల్లాలో మొదటి విడతలో నాలుగు రిజర్వాయర్లు, 272పెద్ద చెరువులు సహా మొత్తం 876 చెరువులు, కుంటల్లో ఉచిత చేపపిల్లల సరఫరాకు ప్రభుత్వం అనుమతించింది. రూ.2.27కోట్ల విలువైన 1.75కోట్ల చేపపిల్లలను మొదటి విడతలో సరఫరా చేశారు. వీటిలో 80నుంచి 100మిల్లీమీటర్ల సైజు కల్గిన 1.07కోట్ల చేపపిల్లలను నాలుగు రిజర్వాయర్లు, 272పెద్ద చెరువుల్లో అలాగే 35నుంచి40 మిల్లీమీటర్ల సైజు కల్గిన 68లక్షల చేపపిల్లలను 600చిన్నతరహా కుంటలు, చెరువుల్లో విడుదల చేశారు.

రొయ్యపిల్లల ఊసేదీ?

బీఆర్ఎస్ హయాంలో ఖమ్మంజిల్లాలోని (మిగతా 6వ పేజీలో)



3.59కోట్ల చేపపిల్లలకు ప్రతిపాదనలు పంపించాం

జి.శివప్రసాద్, ఖమ్మం జిల్లా మత్స్యశాఖ అధికారి

ఖమ్మం జిల్లాలో అన్ని తరహా నీటివనరులు మొత్తం 876ఉండగా వాటిలో పోసేందుకు ఈ ఏడాది 3.59కోట్ల చేపపిల్లల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. నాలుగు రిజర్వాయర్లలో 46లక్షలు, 272చెరువుల్లో 1.69కోట్లు, 600కుంటలు, చెరువుల్లో 1.30కోట్ల చేపపిల్లలను ఎప్పుడిచ్చినా పోసేందుకు సిద్ధంగా ఉన్నాం.

మంత్రి పొంగులేటి చొరవతో..

గతేడాది మొదటి విడతలో చేపపిల్లల సరఫరా పూర్తిస్థాయిలో లేకపోవడంతో అక్టోబరు 11న జరిగిన సమీక్షలో రెండోవిడత ఉచిత చేపపిల్లల సరఫరా అంశం ప్రస్తావనకు వచ్చింది. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఈ అంశాన్ని వెంటనే అప్పటి రాష్ట్ర మత్స్యశాఖ డైరెక్టర్ ప్రియాంక అలా దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన తీసుకున్న ప్రత్యేక చొరవతో అదేనెల 14న రెండోవిడత చేపపిల్లల కోసం జిల్లా మత్స్యశాఖ అధికారి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపగా.. 1.07కోట్ల ఉచిత చేపపిల్లల సరఫరాకు అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. అయితే ఆ సమయంలో కేవలం ఖమ్మంజిల్లాకు మాత్రమే రెండోవిడతలో రూ.1.85కోట్ల నిధులతో 1.07కోట్ల ఉచిత చేపపిల్లలను సరఫరా చేయగా.. మిగిలిన 32జిల్లాలకు చేపపిల్లలు ఇవ్వలేదు.



ప్రసంగిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ప్రతిపక్షాల కుట్రలను తిప్పికొట్టాలి

- ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించాలి
- మళ్లీ సెంటిమెంట్‌ను రెచ్చగొట్టాలనుకునే వారి ఆటలు సాగవు
- రేపటి ఖర్గే సభకు అన్ని నియోజకవర్గాల నుంచి తరలాలి
- కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల సమావేశంలో మంత్రి తుమ్మల

ఖమ్మం, జూలై 2 (ఆంధ్రజ్యోతిప్రతినిధి) : ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో పాలన సాగిస్తున్న కాంగ్రెస్ సర్కారుపై ప్రతిపక్షాలు చేస్తున్న కుట్రలను సమర్థవంతంగా తిప్పికొట్టాలని, మళ్లీ సెంటిమెంట్‌తో ప్రజలను రెచ్చగొట్టాలనుకునే వారి ఆటలు సాగవని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఉద్ఘాటించారు. 4వతేదీ హైదరాబాదులో జరిగే ఖర్గే సభకు జిల్లా నుంచి శ్రేణులు తరలేలా సమాయత్తం చేసేందుకు బుధవారం కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ అధ్యక్షతన ఖమ్మం జిల్లా నాయకులు, కార్యకర్తల సమాశం నిర్వహించారు. ఈసమావేశానికి హాజరైన మంత్రి తుమ్మల మాట్లాడుతూ క్రమశిక్షణతో పని చేసినప్పుడే పార్టీలో అవకాశాలు వస్తాయని, నిరాశ, నిస్పృహలతో ఉండొద్దన్నారు. ఖర్గే సభకు క్రమశిక్షణతో అన్ని నియోజకవర్గాల నుంచి నాయకుల, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ సర్కారు (మిగతా 6వ పేజీలో)

ఎప్‌సెట్ విద్యార్థుల ఇక్కట్లు

- రెండో రోజూ కౌన్సెలింగ్ సెంటర్లలో మొరాయించిన సర్వర్
- ఖమ్మంలో 628 మంది, భద్రాద్రిలో 417మంది హాజరు



వివరాలు : 7లో

బీసీ బిల్లు ఆమోదం కోసం

కేంద్రంపై ఒత్తిడి

- ముందుగా 42శాతం రిజర్వేషన్లు కల్పించాలి
- ఆ తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి
- ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత
- ఖమ్మంలో మాజీ ఎమ్మెల్యే మదన్‌లాల్ కుటుంబానికి పరామర్శ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కవిత

ఖమ్మం, జూలై 2(ఆంధ్రజ్యోతిప్రతినిధి) : బీసీ బిల్లు ఆమోదంపై కేంద్రంపై ఒత్తిడి తెస్తామని, రాష్ట్రంలో బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్లు కల్పించిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. బుధవారం ఖమ్మం వచ్చిన ఆమె ఇటీవల మరణించిన వైరా మాజీ ఎమ్మెల్యే బానోతు మదన్‌లాల్ నివాసానికి వెళ్లారు. తొలుత ఆయన చిత్రపటానికి నివాళులర్పించిన అనంతరం మదన్‌లాల్ సతీమణి, కుటుంబసభ్యులను ఓదార్చారు. మదన్‌లాల్‌తో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. అనంతరం అక్కడ ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజలను మోసం చేసే ఎత్తుగడలో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో బీసీ రిజర్వేసన్ బిల్లును ఆమోదించి చేతులు దులుపుకొందని, మూడునెలల్లోపు బీసీ రిజర్వేసన్ బిల్లును పరిష్కరించాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు లోబడి కేంద్ర ప్రభుత్వం బిల్లును ఆమోదించాలని సూచించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు ఇందుకు చొరవ తీసుకోవాలని కోరారు. రైతుభరోసా నిధులు పంపిణీచేసి ఎన్నికలకు వెళ్దామని రాష్ట్ర సర్కారు భావించినా రైతులు సంతోషంగా లేరని పేర్కొన్నారు. సన్నవడ్లకు బోనస్ ఇస్తామని మోసం చేసిందని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీలు ఏ ఒక్కటి అమలుచేయడంలేదని, మహిళలకు రూ.2500, రూ.4వేలకు పింఛన్ల పెంపు పేరుతో మోసం చేశారన్నారు. కవిత వెంట ఖమ్మం డీసీసీబీ మాజీచైర్మన్ కూరాకుల నాగభూషణం బీఆర్ఎస్ నాయకులు గుండాల కృష్ణ, నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



రూరల్ పోలీస్ స్టేషన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి

ప్రతీ హామీని నెరవేరుస్తున్నాం

- రాష్ట్ర ఆర్థిక స్థితిని సరిచేస్తూ ముందుకు సాగుతున్నాం
- రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- ఖమ్మం రూరల్ మండలంలో పర్యటన

ఖమ్మం రూరల్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతీ హామీని నెరవేరుస్తున్నామని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను సరి చేస్తూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఖమ్మం రూరల్ మండలంలో పర్యటించిన ఆయన పొన్నేకల్లు నుంచి నరసింహాపురం వయా పొన్నేకల్లు చెరువు వరకు రూ.2.53కోట్లతో నిర్మించనున్న బీటీ రోడ్డుకు, ఏదులాపురం నుంచి గొల్లగూడెం రోడ్డు వయా ఆదిత్య నగర్ లింకు రోడ్డు వరకు రూ.88లక్షలతో నిర్మించే రోడ్డుకు, ఏదులాపురం, గొల్లగూడెం-ముత్తగూడెం వరకు రూ.83 లక్షలతో నిర్మించే రోడ్డుకు శంకుస్థాపన చేశారు. అలాగే ఆధునికీకరించిన రూరల్ పోలీస్‌స్టేషన్‌ను ఎంపి రఘురాంరెడ్డితో కలిసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి పొంగులేటి, ఎంపీ రఘురాంరెడ్డి మాట్లాడుతూ ప్రజల ఆశీర్వాదంతో ఇందిరమ్మ ప్రభుత్వ పాలన వచ్చిందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామన్నారు.

గత ప్రభుత్వం రైతుకు పెట్టుబడి సాయం ఎకరానికి రూ.10వేలు ఇస్తే ప్రజా ప్రభుత్వం రూ.12వేలకు పెంచిందని, తొమ్మిది రోజుల్లో 70లక్షల మంది రైతులకు కోటి 49 లక్షల ఎకరాలకు గాను రూ.9వేల కోట్లు రైతు భరోసా నిధులు రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు. ప్రతీ గ్రామంలో ప్రతీ అర్హుడికి ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నామని, రాబోయే మూడున్నరేళ్లలో మరో మూడు విడతల్లో అర్హులైన పేదలను ఎంపిక చేసి ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామన్నారు. కేబుల్‌బ్రిడ్జి నిర్మాణంలో ఇళ్లు కోల్పోయిన 42 మంది నిర్వాసితులకు ఇళ్ల (మిగతా 6వ పేజీలో)



ఖమ్మంలో జగన్నాథ రథయాత్ర దృశ్యం 7

కదిలింది.. జగన్నాథ రథం

- ఖమ్మంలో కన్నుల పండువగా రథ యాత్ర



నేడు ప్రపంచ ప్లాస్టిక్ సంచుల వ్యతిరేక దినం

పర్యావరణానికి ప్లాస్టిక్ కాటు

- కలుషితమవుతున్న నింగి, నేల, ఆకాశం
- ఆరోగ్యాన్ని హరిస్తున్న మహమ్మారి

6

వాన ముసురు.. సాగు జోరు

- ఉమ్మడి జిల్లాలో విస్తారంగా వర్షం
- ఊపందుకున్న వ్యవసాయ పనులు
- రిజర్వాయర్లు, చెరువులు, కుంటలకు చేరుతున్న నీరు

ఖమ్మం (ఆంధ్రజ్యోతిప్రతినిధి) / కొత్తగూడెం , జూలై 2 (ఆంధ్రజ్యోతి): వరుణుడు కరుణించాడు. మూడురోజులుగా పడుతున్న ముసురువానలతో వ్యవసాయ పనులు ముమ్మరమయ్యాయి. సాగు పనులు జోరందుకున్నాయి. ఉమ్మడి జిల్లాలోని రిజర్వాయర్లు, వాగులు, చెరువులకు కొత్త నీరు చేరుతోంది. కొన్ని చోట్ల వాగులు పొంగి ప్రవహిస్తుండగా.. చెరువులు అలుగులు పడుతున్నాయి. ఖమ్మం జిల్లాలో బుధవారం 22.7 మి.మీ.సగటు వర్షపాతం నమోదయింది. కామేపల్లి మండలంలో 62.6మి.మీ., సింగరేణి మండలంలో 53.2మి.మీ., పెనుబల్లిలో 29.2మి.మీ., సత్తుపల్లి, తల్లాడలో 28.4మి.మీ. వర్షపాతం నమోదయింది. ఈ వర్షాలతో ఏన్కూరు, తల్లాడ, కొణిజర్ల, చింతకాని తదితర మండలాల్లో వాగులు అలుగుల పోస్తున్నాయి. వ్యవసాయ పనులు ముమ్మరమయ్యాయి, జిల్లాలో ఇప్పటికే 2,33,053 ఎకరాల్లో పంటలు వేయగా వరి 35,480 ఎకరాలు, కరివేద 16,214, వరినాట్లు నేరుగా 2,566ఎకరాలు, పత్తి 1,50,891, పచ్చపెసర 6,966, జనుము 53,500 ఎకరాల్లో వేశారు. భద్రాద్రి జిల్లాలో బుధవారం 45.1మి.మీ.సగటు వర్షపాతంనమోదుకాగా అత్యధికంగా పాల్వంచలో 86.2మి.మీ., బూర్గంపాడులో81.6మి.మీ., భద్రాచలం 61.6మి.మీ., ములకపల్లి 52.2మి.మీ., సుజాతనగర్ 65.4మి.మీ., చుంచుపల్లి 59.2మి.మీ., టేకులపల్లి 56.2మి.మీ., ఇల్లందు 52.6మి.మీ., జూలూరుపాడు 49.2మి.మీ., అశ్వాపురం 55.6మి.మీ. వర్షపాతం నమోదయింది. మిగిలిన మండలాల్లో 20నుంచి40మి.మీ.వర్షపాతం పడింది. జిల్లాలో గోదావరి, కిన్నెరసాని, ముర్రేడుకు వరదనీరు చేరుతుంది. పలు చోట్ల వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. ఖమ్మం జిల్లా వైరా రిజర్వాయర్ నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. పూర్తిస్థాయి నీటిమట్టం 18.3అడుగులు కాగా.. బుధవారం సాయంత్రానికి 16.4అడుగులకు చేరింది.

బొగ్గు ఉత్పత్తికి అంతరాయం


భారీ వర్షాల కారణంగా ఇల్లెందు, మణుగూరు, కొత్తగూడెం ఏరియాలో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. ఇల్లెందు ఏరియాలోని కోయగూడెం ఓపెన్‌కాస్టు, మణుగూరులోని కొండాపూరం ఓపెన్‌కాస్టుల్లో బొగ్గు ఉత్పత్తి సగానికి పైగా నిలిచిపోయినట్లు తెలిసింది.



జూలూరుపాడులో పంట చేలో నిలిచిన వర్షపు నీరు

రామాలయంపై ముసురు ప్రభావం

భద్రాద్రి వద్ద స్వల్పంగా తగ్గిన గోదావరి నీటిమట్టం



ఖాళీగా ఉన్న క్యూలైన్లు 6

ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల దుశ్చర్య

ఇన్‌ఫార్మర్ నెపంతో గిరిజనుడి హత్య

చర్ల, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాలో మావోయిస్టులు దుశ్చర్యకు పాల్పడ్డారు. ఊసూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని పోరంపల్లి గ్రామానికి చెందిన రాము(45) అనే గిరిజనుడిని పోలీస్ ఇన్‌ఫార్మర్ నెపంతో బుధవారం తెల్లవారు జామున మావోయిస్టులు హత్య చేశారు. రాము ఇంటికి బుధవారం తెల్లవారు జామున వచ్చిన మావోయిస్టులు మాట్లాడాలంటూ బయటకు తీసుకొచ్చి పదునైన కత్తులతో పొడిచి హత్య చేసి వెళ్లిపోయారు. ఈ ఘటనపై బీజాపూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గత 20 రోజుల వ్యవధిలో ఒక్క బీజాపూర్ అడవుల్లో ఏడుగురు గిరిజనులను మావోయిస్టులు హతమార్చారు.

ఐఈడీ పేలి ఒకరికి గాయాలు

పోలీసులే లక్ష్యంగా మావోయిస్టులు అమర్చిన ఐఈడీ పేలి ఓ గిరిజనుడు తీవ్రంగా గాయపడిన సంఘటన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా మెటల్‌గూడ గ్రామంలో బుధవారం ఉదయం జరిగింది. మెటల్‌గూడ గ్రామానికి చెందిన విశాల్ అనే వ్యక్తి ఎప్పటి లానే అటవీ ఉప్పత్తుల కోసం అడవిలోకి వెళ్లిన క్రమంలో పోలీసులే లక్ష్యంగా మావోయిస్టులు అమర్చిన ఐఈడీపై కాలు వేశాడు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న తాతా మధుసూదన్

ప్రజలను వంచించిన కాంగ్రెస్

- అవగాహన, అనుభవం లేని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- ఆ చానల్‌పై జరిగింది దాడి కాదు.. నిరసన మాత్రమే
- వ్యక్తిత్వ హననానికి పాల్పడితే దాడులకు వెనుకాడం
- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్

నేలకొండపల్లి, జూలై2 (ఆంధ్రజ్యోతి): అలవి కాని హామీలనిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజలను వంచిస్తున్నదని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూధన్ అన్నారు. నేలకొండపల్లి బీఆర్‌ఎస్ కార్యాలయంలో బుధవారం ఉదయం జరిగిన విలేకరుల సమావేశంలో తాతా మధుసూదన్ మాట్లాడారు. రాష్ట్ర ఆర్థిక పరిసితి బాగా లేదు.. నేనేమీ చేయలేనని బహిరంగంగా చేతులెత్తేసిన ముఖ్యమంత్రికి అవగాహన, అనుభవం ఉందనలా?లేదనాలా? అంటూ వ్యంగ్యంగా అన్నారు. ఫోన్ ట్యాపింగ్ పేరుతో కొన్ని పత్రికలు కేసీఆర్, కేటీఆర్‌లను టార్గెట్ చేస్తున్నాయన్నారు. వ్యక్తిత్వ హననానికి పాల్పడితే సహించబోమన్నారు. మహాన్యూస్‌పై జరిగింది దాడి కాదని, కేవలం నిరసన మాత్రమేనన్నారు. కేసీఆర్, కేటీఆర్‌ల వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్న మీడియా సంస్థలను ఉపేక్షించబోమన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు సదరు మీడియా సంస్థలపై దాడులు చేయటానికి సైతం వెనుకాడబోరని హెచ్చరించారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షుడు ఉన్నం బ్రహ్మయ్య, మండల మాజీ ఎక్స్ అఫీషియో సభ్యుడు ఎండీ వాజీద్ నాయకులు మరికంటి రేణుబాబు, అనగాని నర్సింహారావు, కోటి సైదారెడ్డి, నంబూరి సత్యనారాయణ, దీప్లా నాయక్, కమదన ప్రవీణ్ పాల్గొన్నారు.

విద్యార్థుల నైపుణ్యాలను వెలికితీయాలి

- ఐటీడీఏ పీవో రాహుల్

దుమ్ముగూడెం జూలై 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చదువుతోపాటు ఇష్టమైన కళలను గుర్తించి వారిలో దాగి ఉన్న ప్రతిభా, నైపుణ్యాలను వెలికితీయాలని ఐటీడీఏ పీవో బి.రాహుల్ అన్నారు. కొత్తపల్లి గిరిజన బాలుర ఆశ్రమపాఠశాలను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలు, తరగతి గదులు, గ్రంథాలయాలను సందర్శించారు. తరగతి గదుల్లో ఉపాధ్యాయుల బోధనాతీరును పరిశీలించారు. చిన్నారులకు అర్థమయ్యేలా ఆంగ్ల పదాలను వారిచేత బోర్డుపై రాయించి అర్థాలను తెలుగులో చెప్పాలన్నారు. పాఠ్యాంశాలతోపాటు విద్యార్థులకిష్టమైన వ్యాసరచన, క్విజ్, నాటికలు, ఏకపాత్రాభినయానికి సంబంధించిన అంశాల పట్ల అవగాహన కల్పించాలని సూచించారు. రాత్రిపూట విద్యార్థులు బయటకు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పరిసరాల పరిశుభ్రత, మెనూ ప్రకారం వేడి ఆహారాన్నందించాలని ఆదేశించారు. హెచ్ఎం పాయం నర్సింహారావు, టీచర్లు పాల్గొన్నారు.



పర్యావరణానికి ప్లాస్టిక్ కాటు

- కవర్ల వినియోగంతో మరింత ముప్పు
- కలుషితమవుతున్న నింగి, నేల, ఆకాశం
- ఆరోగ్యాన్ని హరిస్తున్న మహమ్మారి
- ఆదరణ లేని జూట్ బ్యాగ్‌లు
- కనుమరుగైన చేతి సంచులు

నేడు ప్రపంచ ప్లాస్టిక్ సంచుల వ్యతిరేక దినం

ఖమ్మం కార్పొరేషన్/ భద్రాచలం, జూలై 2(ఆంధ్రజ్యోతి): రెండు దశాబ్దాల క్రితం మార్కెట్‌కు చేతిలో సంచితో వెళ్లేవారు. మహిళలైతే అందమైన వైరు బుట్టలను తీసుకెళ్లేవారు. కాల క్రమేనా ఇవి కనుమరుగవుతున్నాయి. వాటి స్థానాన్ని ప్లాస్టిక్ సంచులు(క్యారీ బ్యాగ్‌లు) ఆక్రమించాయి. తక్కువ ధరకు, ఉచితంగా లభిస్తుండటంతో ప్రజలు వాటినే ఉపయోగిస్తున్నారు. కేవలం ఐదేళ్ల కాలంలోనే ప్లాస్టిక్ సంచులు ప్రజల చేతుల్లో ఇమిడిపోయాయి.

అన్ని రకాలా ముప్పు

ప్లాస్టిక్ బూతం కారణంగా మనుషులు, జంతువులు, పర్యావరణానికి ముప్పుగా మారింది. నిత్యం వివిధ రూపాల్లో మానవ శరీరంలోకి కూడా చేరుతోంది. భూమి మీద ఉన్న జంతువులు, నీటిలోని చేపలు సైతం ప్లాస్టిక్ బారిన పడుతున్నాయి. సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ కవర్లపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు యేటా జూలై 3వ తేదీన ఇంటర్నేషనల్ ప్లాస్టిక్ బ్యాగ్ ఫ్రీ డేగా నిర్వహిస్తున్నారు.

ఆదరణ లేని జూట్ బ్యాగ్‌లు

ప్లాస్టిక్ సంచుల స్థానంలో మహిళా స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో జూట్ బ్యాగ్‌లను ప్రోత్సహించాలని ప్రభుత్వం ముందుకు వచ్చింది. జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో సెర్ప్, పట్టణ ప్రాంతాల్లో మెప్మా ఆధ్వర్యంలో మహిళ సంఘాల ద్వారా 20 జూట్ యూనిట్లు ఏర్పాటు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో సరైన ఆదరణ లేక పోవటంతో అవి మూలకు చేరాయి. ఇక పట్టణ ప్రాంతాల్లోను సాధారణ మార్కెట్‌లో ప్రజలు ఆదరించటం లేదు. దీంతో మహిళా స్వయం సహాయక సంఘాలు కేవలం ఆర్డర్‌లపైనే ఆధారపడుతున్నాయి. విద్యా సంస్థలు, ఆస్పత్రులు, హోటల్స్, పలు కార్యక్రమాలకు జూట్ బ్యాగ్‌లను తయారు చేసి అందిస్తున్నారు.



మార్కెట్‌లో కవర్ల వాడకం

నిబంధనలు బేఖాతర్

కవర్లుకనీసంగా 120మైక్రాన్స్ ప్రమాణికం ఉంటేనే వాటిని ఒక్కసారి వినియోగానికి వాడాలి. ఖమ్మం నగరంలో 90శాతం వరకు చిరు, వీధి వ్యాపారుల నుంచి షాపింగ్ మాల్స్ వరకు నిషేదిత కవర్లు, ప్లాస్టిక్‌ను వినియోగిస్తున్నారు. ఖమ్మం నగరంలోని కస్బాబజార్, కమాన్‌బజార్, గాంధీచౌక్ ప్రాంతాల్లోని నల్గురు పెద్ద వ్యాపారులు నిషేధిదిత ప్లాస్టిక్ కవర్లను టన్నుల కొద్ది తీసుకొచ్చి వ్యాపారులకు విక్రయిస్తున్నారు.



ఒక్క జూట్ సంచి వెయ్యి కవర్లకు సమానం

పాకాలపాటి అరుణ, శ్రీహన్విక జూట్ వరల్డ్

పర్యావరణ హితం కోసం జూట్ బ్యాగ్‌లను తయారు చేస్తున్నా. రూ.30 నుంచి రూ.500ల వరకు ఒక్కో బ్యాగ్ సైజును బట్టి అందుబాటులో ఉంది. 50కు పైగా రకాలు ఉత్పిత్తు చేస్తున్నాం. విద్యార్థులకు పెన్సిల్ కవర్ నుంచి ల్యాప్‌టాప్ బ్యాగ్‌ల వరకు జూట్ సంచులతో తయారు చేస్తున్నాం. ఆర్డర్‌లపై బ్యాగ్‌లపై ముద్రణ వేస్తున్నాం. మార్కెట్‌లో జూట్ బ్యాగ్‌లపై అవగాహన తక్కువగా ఉంది.



2019 సెప్టెంబరు 7న ప్లాస్టిక్ రహిత భద్రాద్రిగా ప్రకటించి ర్యాలీ నిర్వహించిన దృశ్యం

రోజుకు మూడు క్వింటాళ్లపైనే ప్లాస్టిక్ వ్యర్థాలు

భద్రాచలంలో నియంత్రణ శూన్యం

భద్రాచల పుణ్యక్షేత్రంలో ప్లాస్టిక్‌పై నియంత్రణ కరువైంది. వ్యాపారులు, ప్రజలు ఇష్టానుసారంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను విచ్చలవిడిగా వినియోగిస్తున్నారు. ఫలితంగా ప్రతి రోజు భద్రాచలంలో మూడు క్వింటాళ్లపైనే ప్లాస్టిక్ వ్యర్థాలు వెలువడుతున్నాయి. నియంత్రణ లేకపోవడంతో ప్లాస్టిక్ బాటిల్స్, కవర్లు, గ్లాసులు, ఇలా ఇష్టానుసారంగా వినియోగించడం వలన పర్యావరణంకు ముప్పు ఏర్పడుతుందని పర్యావరణ ప్రేమికులు వాపోతున్నారు.

ప్లాస్టిక్ రహిత భద్రాద్రిగా నిలిచి..

గతంలో భద్రాచలంను ప్లాస్టిక్ రహితంగా చేసేందుకు ఉవ్వెత్తున కార్యక్రమాలు సాగాయి. ఒక ప్రముఖ స్వచ్ఛంద సంస్థ ఇందుకు సారథ్యం వహించి ఏడాది పాటు కార్యక్రమాలను సైతం నిర్వహించింది. అనూహ్యంగా ఇందుకు ఆనాడు ప్రజలు, వ్యాపారులు, అధికారుల నుంచి సానుకూల స్పందన రాగా 2019 సెప్టెంబరు 7 నుంచి ప్లాస్టిక్ రహిత భద్రాద్రిగా సైతం ప్రకటించారు. ఈ క్రమంలో ఎవరైనా వ్యాపారులు, హోటల్ నిర్వాహకులు ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు వినియోగిస్తే వారికి భారీ ఎత్తున జరిమాన విధించేవారు. ఈ విధంగా కొంతకాలం అమలు చేసినా అనంతరం అధికారులు పట్టించుకోవడం మానేశారు. దీంతో వ్యాపారులు సైతం యథా ప్రకారం సింగిల్ ప్లాస్టిక్ క్యారీ బ్యాగులను వినియోగించడం సర్వ సాధారణమైపోయింది.

మున్నేరు వద్ద నీటి ప్రవాహంతో ట్రాఫిక్ మళ్లింపు

ఖమ్మం ఖానాపురం హవేలీ/ ఖమ్మం రూరల్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని కాల్వొడ్డు నుంచి నాయుడుపేట మున్నేరు వంతెన వద్ద ఉన్న చప్టా రోడ్డుపై బుధవారం ఉదయం నుంచి వరద నీటి ప్రవాహం పెరుగుతున్న నేపథ్యంలో వాహనాల రాకపోకలను నిలిపివేసినట్లు ట్రాఫిక్ ఏసీపీ బెల్లం సత్యనారాయణ తెలిపారు. కాల్వొడ్డు మున్నేరు చప్టాపై వరద నీరు తగ్గిన వెంటనే తిరిగి ట్రాఫిక్‌ను పునరుద్ధరిస్తామని తెలిపారు. అప్పటి వరకు ప్రజలు ప్రత్యామ్నాయ మార్గాలలో వెళ్లాలని విజ్ఞప్తి చేశారు. బుధవారం ట్రాఫిక్ బైపాస్ కురుణగిరి బ్రిడ్జ్ నుంచి వెళ్లటంతో ట్రాఫిక్ సమస్యలు ఎదురయ్యాయి.



కాల్వొడ్డు వద్ద దారిని మూసివేసిన దృశ్యం

వరదకు కొట్టుకుపోయిన బ్రిడ్జి అప్రోచ్



వరద కోతకు కొట్టుకుపోయిన అప్రోచ్

రాకపోకలకు ప్రభాత్‌నగర్ వాసుల అవస్థలు

పాల్వంచ రూరల్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): చిన్నపాటి ముసురు వానలకే కాంట్రాక్టర్ నిర్లక్ష్యం.. అధికారుల పర్యవేక్షణ లోపం బయటపడింది. పాల్వంచ మండలంలోని ప్రభాత్‌నగర్ వద్ద ప్రధానమంత్రి సడక్‌యోజన పథకం కింద రూ.1.77కోట్లతో నిర్మించిన బ్రిడ్జి ఇరువైపులా అప్రోచ్‌లు బుధవారం వరదకు కొట్టుకుపోయాయి. దీంతో పలు గ్రామాల మధ్య ప్రజల రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. యానంబైలు, ప్రభాత్‌నగర్ మీదుగా పాండురంగాపురం, జిన్నెగట్టు, ఉప్పుసాక గ్రామాలకు ఈ బ్రిడ్జి మీదుగా ప్రజల రాకపోకలు సాగుతుం టాయి. అయితే బ్రిడ్జి పనులు చేపట్టిన కాంట్రాక్టర్ నాణ్యత పాటించలేదని, అనేకసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించు కోలేదని స్థానికులు మండిపడు తున్నారు. నాణ్యత లేకపోవడంతోనే చిన్నా పాటి వానలకు అప్రోచ్‌మెంట్ కొట్టుకుపో యాయని, దీంతో రోడ్లు గుంతలుగా మారి స్థానికులు అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బ్రిడ్జి పనులు పూర్తయ్యాయి : ఏఈ శివలాల్

అప్రోచ్‌మెంట్ పనులు పూర్తి స్థాయిలో జరగలేదు. బ్రిడ్జి పనులు మాత్రమే పూర్తి అయ్యాయి. కాంట్రాక్టర్‌తో అప్రోచ్‌మెంట్ పనులు పూర్తి చేయిస్తాం. ప్రజల రాకపోకలకు ఇబ్బంది లేకుండా తాత్కాలికంగా పనులు చేయిస్తాం.



కిన్నెరసాని జలాశయం

కిన్నెరసానికి వరద నీరు..

397.10 అడుగులకు నీటిమట్టం చేరిక

పాల్వంచ రూరల్, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : రెండు రోజులుగా పడుతున్న వర్షాలతో కిన్నెరసాని జలాశయానికి వరద నీరు చేరుతోంది. పాకాలకొత్తగూడెం గుండాల, ఇల్లెందు, టేకులపల్లి, కొత్తగూడెం అటవీ ప్రాంతం నుంచి నీరు ప్రాజెక్టుకు వస్తోంది. కిన్నెరసాని పూర్తిస్థాయి నీటి మట్టం 497అడుగులు కాగా రెండ్రోజుల క్రితం 396అడుగులు ఉంది. ఆ తర్వాత మరో అడుగు పెరిగి.. బుధవారం 397.10అడుగులకు చేరింది. కాగా ఇన్‌ఫ్లోను అంచనా వేసుకుని ప్రాజెక్టు అధికారులు అప్రమత్తమవుతున్నారు.




వైరా రిజర్వాయర్

16.4అడుగులకు వైరా రిజర్వాయర్

పూర్తిస్థాయి నీటిమట్టానికి రెండడుగుల దూరంలో..

వైరా, జూలై 2 (ఆంధ్రజ్యోతి): వర్షాలు విస్తారంగా పడుతున్న క్రమంలో వైరా రిజర్వాయర్ నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. రిజర్వాయర్ పరివాహకంలో కురిసిన వానలకు ఒక్కరోజులోనే దాదాపు అడుగు మేర నీరు వచ్చి చేరింది. దాంతో సోమవారం 15.5అడుగులుగా ఉన్న నీటిమట్టం బుధవారం సాయంత్రానికి 16.4అడుగులకు పెరిగింది. రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 18.3అడుగులు కాగా.. మరో రెండు అడుగుల నీరు వస్తే పూర్తిస్థాయిలో నిండుతుంది.

భద్రాద్రి రామాలయంపై ముసురు ప్రభావం



నిలకడగా ఉన్న గోదావరి



భక్తులు లేకుండా ఖాళీగా ఉన్న రామాలయం

స్వల్పంగా తగ్గిన గోదావరి నీటిమట్టం

నేడు మళ్లీ పెరిగే అవకాశం!

భద్రాచలం, జూలై 2 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం రామాలయంపై ముసురు ప్రభావం పడింది. ఎడతెరిపిలేని జల్లులతో ఇతర ప్రాంతాల నుంచి భక్తుల రాక తగ్గింది. దీంతో బుధవారం ఆలయ పరిసరాలు బోసిపోయాయి. ఇక భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం స్వల్పంగా తగ్గుతోంది. మంగళవారం 13.4 అడుగులకు చేరిన నీటిమట్టం క్రమేపీ తగ్గుతూ బుధవారం రాత్రి 7 గంటలకు 11.4 అడుగులకు చేరింది. ఇదిలా ఉండగా నదీ పరివాహక ప్రాంతంలో పడుతున్న వర్షాలతో గురువారం గోదావరి మళ్లీ స్వల్పంగా పెరిగే అవకాశాలున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

జీపీఎఫ్ బిల్లులకు త్వరలోనే మోక్షం

- పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దామోదర్‌రెడ్డి



మాట్లాడుతున్న దామోదర్‌రెడ్డి

ఖమ్మం ఖానాపురంహవేలి, జూలై 2(ఆంధ్రజ్యోతి): జీపీఎఫ్ పెండింగ్ బిల్లులకు త్వరలోనే మోక్షం లభించనున్నదని పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. దామోదర్‌రెడ్డి అన్నారు. మంగళవారం నగరంలోని సంఘం జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బదిలీలు, పదోన్నతుల విషయమై ప్రభుత్వంతో మాట్లాడటం జరిగిందని, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిసి పెండింగ్ బిల్లుల మంజూరు చేయాలని కోరామని అన్నారు. ఉప ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి త్వరలోనే పెండింగ్ బిల్లులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారని అన్నారు. అనంతరం సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన కట్టా శేఖర్‌రావు రాష్ట్ర, జిల్లా నాయకుల సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు.

తెలంగాణ అగ్రి- హార్టికల్చర్ సొసైటీ నూతన కార్యవర్గం ఎన్నిక



నల్లమల వెంకటేశ్వరరావు

ఖమ్మం వ్యవసాయం, జూలై2(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో బుధవారం అగ్రి- హార్టికల్చర్ సొసైటీ జనరల్ బాడీ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి పర్యవేక్షణలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కమిటీ 2028 జూన్ 30 వరకు కొనసాగుతుంది. చైర్మన్‌గా సీఎచ్ సుధాకర్ రావు, వైస్ చైర్మన్‌గా రంగారెడ్డి, కార్యదర్శిగా రంగారావు, సహాయ కార్యదర్శులుగా శ్రీధర్ రెడ్డి, లావణ్యరెడ్డి, కోశాధికారిగా భానుశర్మ, కార్యవర్గ కౌన్సిలర్లుగా వీరభద్రరావు, పద్మారెడ్డి, షామిదాభాను, వేంకటేశ్వర రావు, గజేందర్ గౌడ్, చీఫ్ అడ్వైజర్లుగా నల్లమల వెంకటేశ్వర రావు, నంద్యాల నర్సింహరెడ్డి ఎన్నికయ్యారు.

ప్రతిపక్షాల కుట్రలను తిప్పికొట్టాలి

(5వ పేజీ తరువాయి)

ఏడాదిన్నరగా చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి, మళ్లీ కాంగ్రెస్ అధికారంలోకి రాబోతుందన్న విశ్వాసాన్ని ప్రజల్లో మరింత పెంచాలని సూచించారు. అభివృద్ధి, సంక్షేమంలో ఏడాదిన్నరగా రాష్ట్రాన్ని ముందుకు తీసుకున్న పోతున్న సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీని దెబ్బతీసేందుకు కొందరు కుట్రలు పన్నుతున్నారని, ఆ కుట్రలను తిప్పికొట్టాలన్నారు. బనకచర్లపై చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదన్న విషయాన్ని ప్రజలకు వివరించాలన్నారు. గోదావరి జలాల వినియోగంపై 2014, 2019లో ఏం జరిగింది? ఎపెక్స్ కమిటీలో ఎవరు ఏ నిర్ణయాలు తీసుకున్నారన్న దానిపై అందరూ అవగాహన పెంచుకోవాలన్నారు. నాడు ఇక్కడి కేసీఆర్ ప్రభుత్వం, అక్కడి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఒప్పందాలు చేసుకున్న విషయాలను ప్రజల్లోకి తీసుకుపోవాలని సూచించారు. కృష్ణా, గోదావరిలపై ప్రాజెక్టులను కట్టాలనుకుంటే పరివాహక ప్రాంతాల ప్రభుత్వాల సంప్రదింపులు, అనుమతులతో సాధ్యమవుతుందన్నారు. మనం కూడా సీతమ్మసాగర్ కడుతుంటే ఒడాసా అభ్యంతరం చెప్పిందని, వారి సూచనల పరిగణలోకి తీసుకుని కరకట్టలు కట్టి 33 టీఎంసీలు నీరు నిల్వ ఉంచేలా ప్రభుత్వం అనుమతి తెచ్చిందని, 66టీఎంసీల నీరు ఎత్తిపోసి ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 7లక్షల ఎకరాలకు సాగునీరు ఇవ్వాలని సీతమ్మసాగర్, సీతారామ ప్రాజెక్టులుప్రారంభించామన్నారు. కృష్ణాజలాలను ధారాదత్తం చేసిన పార్టీలు ఇప్పుడు కాంగ్రెస్‌పై, ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నాయని, వారి నోళ్లు మూయించాలన్నారు. ఏ పార్టీ అయినా తప్పుడు ప్రచారం చేసేవారిపట్ల సహించొద్దని, విమర్శలు చేస్తే ప్రతి విమర్శలు చేసి తీరాలన్నారు. కేంద్ర ప్రభుత్వం పై ఒత్తిడి తెచ్చి రాష్ట్ర అభివృద్ధికి చేస్తున్న కృషిని, నిర్మిస్తున్న ప్రాజెక్టుల గురించి వివరించాలని అప్పుడే ప్రజలు అబద్ధాలు చెప్పే వారి మాటలు నమ్మరన్నారు. ఎం పీ రఘురాంరెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్ సభకు ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి పెద్దఎత్తున హైదరాబాదు సభకు తరలేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని, ముఖ్యనాయకులు, కార్యకర్తలు హాజరుకావాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని ఖండించాలన్నారు. కాంగ్రెస్ ఖమ్మంజిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, పార్టీ పాలేరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ దయాకరరెడ్డి, నగర అధ్యక్షుడు జావీద్ తదితరులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆరుగ్యారంటీల అమలు, పలు పథకాలతో ప్రభుత్వం ముందుకు పోతోందన్నారు.

మీనమేదీ?

(5వ పేజీ తరువాయి)

పాలేరు, వైరా, లంకాసాగర్, బేతుపల్లి గంగారం రిజర్వాయర్లకు ఉచిత రొయ్యపిల్లలను సరఫరా చేశారు. పాలేరు, వైరా రిజర్వాయర్లలో ఏడులక్షల చొప్పున మొత్తం 14లక్షలు, లంకాసాగర్‌లో ఆరు లక్షలు, బేతుపల్లి గంగారంలో మూడులక్షల రొయ్య పిల్లలను విడుదల చేశారు. గతేడాది కాంగ్రెస్ సర్కారు ఉచిత రొయ్యపిల్లల సరఫరాను పట్టించుకోలేదు. ఈ ఏడాది కూడా అదేపరిస్థితి కనిపిస్తోంది.

దిగుబడి లేక నష్టపోయిన మత్స్యకారులు...

గతేడాది రెండు విడతల్లో చేపపిల్లల సరఫరా జరిగినా రిజర్వాయర్లు సహా ఏ నీటివనరుల్లో కూడా ఆశించిన స్థాయిలో దిగుబడి రాక వేలాది మంది మత్స్యకారులు తీవ్రంగా నష్టపోయారు. వలలు, తెప్పలు, ఇతరత్రా పనిముట్లకు పెట్టిన పెట్టుబడి కూడా రాక అప్పులపాలయ్యారు. వైరా, పాలేరు, లంకాసాగర్, బేతుపల్లి గంగారం రిజర్వాయర్లలో ఉచిత రొయ్యపిల్లలు విడుదల చేయని కారణంగా రొయ్యల దిగుబడి పూర్తిగా తగ్గిపోయింది. దాంతో మత్స్యకారులు మరింత నష్టాలు మూటగట్టుకున్నారు. మత్స్య, రొయ్య సంపదను ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని మత్స్యకారులు వాపోతున్నారు.

ప్రతీ హామీని నెరవేరుస్తున్నాం

(5వ పేజీ తరువాయి)

పట్టాలను పంపిణీ చేశామన్నారు. ఇంకా ఎవరైనా అర్హులు ఉంటే వారికి కూడా తప్పనిసరిగా ఇంటి పట్టాలు మంజూరవుతాయన్నారు. ఏదులాపురం మున్సిపాలిటీలో రూ.కోటి46లక్షలతో అనేక సీసీ రోడ్లు పూర్తి చేశామని, రూ.45 కోట్లతో తరుణి హాట్‌లో సమీకృత కార్యాలయాల కాంప్లెక్స్ నిర్మాణం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీ సునీల్ దత్, ఏసీపీ తిరుపతి రెడ్డి, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వర రావు, కాంగ్రెస్ నాయకులు బండి జగదీష్, జొన్నల గడ్డ రవి, మద్ది వీరారెడ్డి, బోడా వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

నేడు కూసుమంచి మండలంలో పొంగులేటి పర్యటన

కూసుమంచి, జూలై 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గురువారం కూసుమంచి మండలంలో పర్యటించనున్నారు. ఉదయం 10గంటలకు కూసుమంచి-ధర్మతండ ఆర్‌అండ్‌బీ రోడ్డుకు ధర్మతండాలో శంకుస్థాపన చేస్తారు. 10:30గంటలకు కోక్యాతండాలో బీటీ రోడ్డుకు, 11గంటలకు లోక్యాతండాలో ఆర్‌అండ్‌బీ రోడ్ల మరమ్మతు పనులకు, 11:30గంటలకు గన్యాతండాలో బీటీరోడ్డు పనులకు, మధ్యాహ్నం 12గంటలకు కూసుమంచి మండలకేంద్రంలో జంక్షన్ అభివృద్ధి, సెంట్రల్ లైటింగ్ పనులకు శంకుస్థాపన చేస్తారు. అనంతరం ప్రజలనుంచి వినతులను స్వీకరిస్తారని మంత్రి క్యాంపుకార్యాలయం ఇన్‌చార్జ్ దయాకర్‌రెడ్డి తెలిపారు.

సత్తుపల్లి ప్రాంతంలో వరినాట్లు ముమ్మరం

సత్తుపల్లి రూరల్, జూలై2 (ఆంధ్రజ్యోతి) : వానలు విస్తారంగా పడుతుండటంతో వాగులు, చెరువులు జలకళను సంతరించుకుంటున్నాయి. అలాగే ఇప్పటికే బోర్లు, వ్యవసాయ బావుల ఆధారంగా రైతులు వరినార్లు పోయగా ప్రస్తుత వర్షాలతో నాట్లు ముమ్మరం చేశారు. వానాకాలం సీజన్ కావడంతో సుమారు 21వేల ఎకరాలలో వరిసాగు, 8500ఎకరాలలో ఆయిల్‌పామ్ సాగుతో పాటు ఇతర పంటలు సాగు చేయనున్నట్లు వ్యవసాయాధికారి వై.శ్రీనివాసరావు తెలిపారు. సుమారు 5వేల ఎకరాల ఆయకట్టు ఉన్న బేతుపల్లి పెద్ద చెరువు నిండాలంటే దమ్మపేట మండలంలో ఎడతెరిపి లేని వర్షాలు కురవాలి. 16అడుగులు నీటిసామర్థ్యం కాగా జీరో పాయింట్ వద్ద నీటిని వదిలితే ఎన్టీఆర్ వరద నీటి కాలువ ద్వారా సత్తుపల్లితో పాటు వేంసూరు మండలంలో సుమారు 50చెరువులకు పైగా నిండనున్నాయి. అలుగు పారితే తమ్మిలేరు ద్వారా సత్తుపల్లి, వేంసూరు మండలాల్లో సాగుకు ఢోకానే ఉండదు. కాగా పలు వాగుల వద్ద స్థానికులు చేపలు పట్టడం కనిపించింది. ఇక వర్షం కారణంగా జేవీఆర్ ఓసీలో 40వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి, 2లక్షల క్యూబిక్ మిలియన్ల ఓబీ పనులకు ఆటంకం ఏర్పడింది. కిష్టారం ఓసీలో 8వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి, 65వేల క్యూబిక్ మిలియన్ల ఓబీ పనులకు అంతరాయం ఏర్పడిందని ప్రాజెక్టు ఆఫీసర్లు పీవోలు ఎన్‌వీఆర్.ప్రహ్లాద్, ఎంవీ.నరసింహారావు తెలిపారు.



ఉధృతంగా ప్రవహిస్తున్న మల్లేపూల వాగు



కాకర్లపల్లిలో నాట్లు వేస్తున్న వ్యవసాయ కూలీలు



కదిలింది.. జగన్నాథ రథం

» ఖమ్మంలో కన్నుల పండువగా రథయాత్ర

ఖమ్మం ఖానాపురంహవేలి, జూలై2(ఆంధ్రజ్యోతి): ఒరిస్సాలోని పూరిలో అత్యంత వైభవంగా నిర్వహించే జగన్నాథ రథయాత్ర గత మూడు సంవత్సరాల నుంచి ఖమ్మంలో కన్నుల పండువగా నిర్వహిస్తున్నారు. ఈ రథయాత్రను నగరంలోని ఇస్కాన్ ఆలయ నిర్వాహకులు నిర్వహిస్తున్నారు. రథయాత్రలో జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్రలను ప్రత్యేకంగా పూజించే ఉత్సవం. బుధవారం ఖమ్మం నగరంలో నిర్వహించిన రథయాత్రకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై రథాలను లాగుతూ ఊరేగింపులో పాల్గొన్నారు.

జగన్నాథ రథయాత్ర హిందూ మతంలో ముఖ్యమైన పండుగ. ఈ యాత్ర నగరంలోని గాంధీచౌక్, వర్తక సంఘం భవన్,పీఎస్ఆర్ రోడ్డు, కాల్వొడ్డు, పాత బస్టాండ్, జెడ్పీ సెంటర్, ఇల్లెందు క్రాస్ రోడ్డు, రోటరీనగర్ వరకు నిర్వహించి ఆలయంలో యాత్ర ముగించారు.



జగన్నాథుడి రథాన్ని లాగుతున్న భక్తులు

నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లతో భరోసా

» ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య



ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

కామేపల్లి, జూలై 2(ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లతోనే భరోసా కల్పిస్తున్నామని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. బుధవారం మండల పరిధిలోని మద్దిగూడెం, తాళ్లగూడెం, టేకులతండ, పింజరమడుగు, పాతలింగాల, నెమలిపురి, గోవింద్రాల, బర్లగూడెం, గరిడేపల్లి గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కనకయ్య మాట్లాడుతూ దేశ అభివృద్ధిలో ఇందిరమ్మ చేసిన కృషి ఎనలేనిదన్నారు. ఆమె పేరుతో పేదలకు ఇళ్లు ఇవ్వడం ఎంతో గౌరవమని అన్నారు. రాష్ట్రంలోని పేద ప్రజలకు 20లక్షల ఇండ్లు ఈ ఐదేళ్లలోనే మంజూరుకు కృషి చేస్తామని అన్నారు. పాతలింగాలలో కేజీబీవీ పాఠశాలకు ప్రహరీకి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కమిషన్ డైరెక్టర్ గోపాల్‌రెడ్డి, గింజల నర్సింహారెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబు, పీఏసీఎస్ చైర్మన్ ధనియాకుల హన్మంతరావు, నల్లమోతు లక్ష్మయ్య, జగన్నాథరెడ్డి, డీఎస్, మద్దిన్ని రమేష్, ఆరెం రవి, బొడ్డు లక్ష్మీనారాయణ, సరిరాం నాయక్, భూక్య విజయమోహన్, పర్యా ఎంపీడీవో రవీందర్, ఎంపీవో ప్రభాకర్‌రెడ్డి, మోహన్, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి స్లోగన్ పోటీల్లో సింగరేణి విద్యార్థి ప్రతిభ



బహుమతి అందుకుంటున్న అక్షయ

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, జూలై2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి స్లోగన్ పోటీలలో కొత్తగూడెం సింగరేణి మహిళా డిగ్రీ కళాశాలలో ఎంఎస్సీ(ఎస్) విద్యార్థిని కె.అక్షయ పాల్గొని తొలి స్థానంలో నిలిచింది. జాతీయ గణాంక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ ఏడాది ఏప్రిల్‌లో పోటీ నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రదర్శన కనబరిచిన వారి పేర్లను హైదరాబాద్‌లో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శిక్షణా కేంద్రంలో ప్రకటించారు. ఐఎస్ఎస్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఎస్.అజిత్‌కుమార్ చేతుల మీదుగా బహుమతిని విద్యార్థి బుధవారం అందుకుంది. ఈ క్రమంలోనే మరో ముగ్గురు కొత్తగూడెం సింగరేణి మహిళా కళాశాల విద్యార్థినులకు జి.అస్మిత, బి.సింధు, కె.సింధు ప్రశంసా పత్రాలను అందుకున్నారు. కళాశాల ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి గుండా శ్రీనివాస్, జాయింట్ సెక్రెటరీ కిరణ్‌కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చింతా శారద ప్రత్యేకంగా అభినందించారు.

ఎప్‌సెట్ విద్యార్థుల ఇక్కట్లు

» రెండో రోజూ కౌన్సెలింగ్ సెంటర్లలో మొరాయించిన సర్వర్

» ఖమ్మంలో 628 మంది, భద్రాద్రిలో 417మంది విద్యార్థుల హాజరు



చుంచుపల్లిలో కౌన్సెలింగ్‌కు హాజరైన విద్యార్థులు

ఖమ్మం ఖానాపురం హవేలి, జూలై 2(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల ప్రవేశానికి సంబంధించిన ఎప్‌సెట్ 2025 సర్టిఫికెట్ల పరిశీలనకు గత రెండు రోజులుగా ఆన్‌లైన్ ఇబ్బందులు తప్పడంలేదు. మంగళవారం నెట్ ఇబ్బందులతో, బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా సర్వర్ పనిచేయకపోవడంతో ఇబ్బందులు పడ్డారు. బుధవారం రెండో రోజు నగరంలోని ఎస్ఆర్‌బీజీఎన్ ఆర్ డిగ్రీ కళాశాలలో ప్రారంభమైన సర్టిఫికెట్ల పరిశీలనకు ఉదయం 8 గంటలకే విద్యార్థులు కళాశాలకు చేరుకున్నారు. మొత్తం 640 మంది స్లాట్ బుక్ చేసుకోగా, 628 మంది హాజరైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ మొహ్మద్ జాకీరుల్లా తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి ప్రారంభమైన సర్టిఫికెట్ల పరిశీలన ఉదయం 10 గంటల వరకు బాగానే ఉన్న సర్వర్ 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు పూర్తిగా బంద్ కావడంతో ఉదయం వచ్చిన విద్యార్థులు రాత్రి వరకు కళాశాలలోనే ఉండాల్సి వచ్చింది. రాష్ట్ర వ్యాప్తంగా ఇబ్బందులు ఉండటంతో అధికారులు సర్వర్ ఇబ్బందులు లేకుండా చూసేందుకు వెంటనే స్పందించి మధ్యాహ్నం 2 గంటల నుంచి సర్వర్‌లో ఇబ్బందులు లేకుండా చేశారని ప్రిన్సిపాల్ తెలిపారు. ఆఫ్‌లైన్‌లో విద్యార్థుల సర్టిఫికెట్ల పరిశీలన పూర్తికావడంతో ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసేందుకు కోఆర్డినేటర్ సుధాకర్ తోపాటు కళాశాల అధ్యాపకులు రాత్రి వరకు కళాశాలలో ఉండి విద్యార్థులకు ఆన్‌లైన్ ఓటీపీ వెళ్లేలా చేశామని ప్రిన్సిపాల్ తెలిపారు.

చుంచుపల్లి, జూలై2(ఆంధ్రజ్యోతి): వర్షంలో ఎప్‌సెట్-2025 కౌన్సెలింగ్ కేంద్రానికి వచ్చిన ఇంజనీరింగ్ విద్యార్థులు ఇక్కట్లు పడాల్సి వచ్చింది. బుధవారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా కురిసన వర్షానికి రుద్రంపూర్ ఎప్‌సెట్ కౌన్సెలింగ్ కేంద్రం చెరువును తలపించింది. ప్రధాన ద్వారం నుంచి కళాశాలలోకి వెళ్లాలన్న అభ్యర్థులు పడిన ఇబ్బందులు వర్ణాతీతం. అభ్యర్థులతో పాటు వచ్చిన తల్లిదండ్రులు, సంరక్షకులకు కనీస వసతులు కల్పించాలని జిల్లా కో-ఆర్డినేటర్ బండి శ్రీనివాస్ కళాశాల సిబ్బందిని ఆదేశించారు. విద్యార్థులు వర్షానికి తడవకుండా కళాశాల సిబ్బంది టెంట్లను ఏర్పాటు చేశారు. కళాశాలలో ఉన్న వివిధ తరగతులలో అభ్యర్థులను పంపించి కూర్చొనే ఏర్పాట్లు చేశారు. కౌన్సెలింగ్ సెంటర్‌లో రెండో రోజు 417 మంది విద్యార్థులు హాజరుకాగా, సాంకేతిక లోపం కారణంగా ఆన్‌లైన్‌లో సర్వర్ మొరాయించడంతో అసహనం వ్యక్తం చేశారు. తిరిగి ఆన్‌లైన్ రావడంతో కౌన్సిలింగ్ కొనసాగింది.

డీసీహెచ్ఎస్ రవిబాబుకు ఉత్తమ డాక్టర్ అవార్డు



రవిబాబుకు అవార్డు ప్రదానం చేస్తున్న సినీ నటుడు సుమన్

చుంచుపల్లి, జూలై2 (ఆంధ్రజ్యోతి): డీసీహెచ్ఎస్ డాక్టర్ రవిబాబు నాయక్‌కు ఉత్తమ డాక్టర్ అవార్డు వరించింది. డాక్టర్ డే సందర్భంగా లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ వారి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్స్ నిర్వహించిన వేడుకల్లో ప్రముఖ కరాటే మాస్టర్, తెలుగు సినీ హీరో సుమన్ చేతుల మీదుగా ఈ పురస్కారం ప్రదానం చేశారు. కరోనా సమయంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ప్రణాళిక బద్ధంగా వైద్య సేవలు అందిస్తూ ...సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ ఎంతో మంది ప్రాణాలు కాపాడారని అభినందించారు. ఈ సందర్భంగా డాకర్ రవిబాబును పలువురు అభినందించారు.

పనిచేస్తున్న బడిలోనే పిల్లల చదువు

» ఆదర్శంగా నిలుస్తున్న ఉపాధ్యాయుడు గురుమూర్తి



ఉపాధ్యాయుడు గురుమూర్తి, విద్యార్థి విశ్వాస్ సన్నిని అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీనర్సయ్య

జూలూరుపాడు, జూలై2 (ఆంధ్రజ్యోతి): తాను పనిచేస్తున్న ప్రభుత్వ పాఠశాలలోనే తన పిల్లలకు విద్యాబుద్ధులను నేర్పిస్తున్నారు ఓ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు. జూలూరుపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న సంద్రు గురుమూర్తి తన ఇద్దరు కుమారులను ప్రభుత్వ పాఠశాలలో చదివిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నాడు. అతని పెద్ద కుమారుడు సంద్రు నిశాంత్ ఇదే పాఠశాలలో 7వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదివాడు. గత ఏడాది 10వ తరగతిలో 563 మార్కులను సాధించి మండల టాపర్‌గా నిలిచాడు. ఇదే విధంగా సదరు ఉపాధ్యాయుడు గురుమూర్తి ఈ ఏడాది తన చిన్న కుమారుడు విశ్వాస్‌సన్నిని జూలూరుపాడు ఉన్నత పాఠశాలలో 7వ తరగతిలో చేర్పించారు. దీంతో ఉపాధ్యాయుడిని ఎంఈఓ జుంకీలాల్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీనర్సయ్య అభినందించారు.

పలువురు సీఐల బదిలీ

ఖమ్మం క్రైం, జూలై2 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న పలువురు సీఐలను బదిలీ చేస్తూ పోలీసుశాఖ ఉన్నతాధికారులు బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. ఖమ్మం మహిళా పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వోగా విధులు నిర్వహిస్తున్న తుమ్మలపల్లి శ్రీహరిని సత్తుపల్లి పోలీసుస్టేషన్ ఎస్‌హెచ్‌వోగా నియమితులయ్యారు. ఆయన స్థానంలో మల్టీజోన్-1లో వెయిటింగ్‌లో ఉన్న నల్లమోతు చిట్టిబాబును నియమించారు. అదేవిధంగా సత్తుపల్లి ఎస్‌హెచ్‌వోగా విధులు నిర్వహిస్తున్న టి.కిరణ్, మధిర సీఐ టి.మధును కూడా మల్టీజోన్-1లో రిపోర్టుచేయాలని పేర్కొన్నారు. మధిర సీఐగా కుమారస్వామి నియమితులయ్యారు. బదిలీఅయిన అధికారులు నేడు బాధ్యతలు చేపట్టనున్నారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

అశ్వారావుపేట రూరల్, జూలై 2(ఆంధ్రజ్యోతి): పాముకాటుకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వివాహిత మృతిచెందిన ఘటన మండలంలో జరిగింది. ఎస్ఐ యయాతిరాజు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దురదపాడు గ్రామానికి చెందిన కురం దేవి(50) గతనెల 28న వ్యవసాయ పనులు ముగించుకుని ఇంటికి వస్తున్న క్రమంలో పాముకాటుకు గురైంది. ఆసమయంలో పాము కనిపించకపోవటంతో పురుగు కుట్టి ఉంటుందని భావించి ఇంటికి వెళ్లింది. రెండు రోజుల తరువాత కాలు వాపురావడంతో కుటుంబసభ్యులు ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు పాముకాటు వేసినట్లుగా తెలిపి చికిత్స నిమిత్తం వరంగల్ తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందింది. మృతురాలి భర్త చినరాజులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

కూసుమంచి, జూలై2 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం-సూర్యాపేట జిల్లాల సరిహద్దులో ఓగుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. సూర్యాపేట జిల్లా నడిగూడెం పోలీస్ స్టేషన్ పరిధిలో కాగిత రామచంద్రాపురం పరిధిలో(ఖమ్మంజిల్లా సరిహద్దు) సాగర్ ఎడమకాల్వ మొదటిజోన్ రంగుల బ్రిడ్జి వద్ద నీటి గుంతలో మృతదేహాన్ని గురించారు. ఈమేరకు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. గుర్తు తెలియని వ్యక్తులు చేతులు తాడుతో కట్టేసి, ఉరి బిగించి హత్యచేసినట్లుగా పోలీసులు భావిస్తున్నారు. మృతుడి కుడిచేతికి స్టీల్ కడియం, ఎడమ భుజంపై స్టీరింగ్ ఆకారంలో గల పచ్చబొట్టు గుర్తించారు. గులాబీరంగు చొక్కా లైట్ బ్లాక్ కలర్ ప్యాంటు ధరించాడు. 20-30 సంవత్సరాల వయస్సు ఉంటుందని, కొన్ని రోజులుగా ఎవరైనా కనిపించకుండా ఉంటే, తమకు 8712686011 నెంబరుకు సమాచారం ఇవ్వాలని మునగాల సీఐ కోరారు. ఈమేరకు మృతదేహాన్ని కోదాడకు తరలించారు.

రేషన్ దందాకు పాల్పడితే చర్యలు

» స్పందించిన జిల్లా యంత్రాంగం

» చట్టపరంగా చర్యలు తీసుకుంటాం: ఆర్డీవో రాజేంద్రగౌడ్



ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కల్లూరు, జూలై 2 (ఆంధ్రజ్యోతి): కల్లూరు డివిజన్‌లోని మండలాల పరిధిలో గల గ్రామాల్లో అక్రమ రేషన్ దందా నిర్మూలనపై చట్టపరంగా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆర్డీవో రాజేంద్రగౌడ్ చెప్పారు. ఇటీవల కాలంలో కల్లూరు మండలంలోని పలు గ్రామాల్లో అక్రమంగా రేషన్ దందా సాగుతున్న విషయమై ఆంధ్రజ్యోతిలో బుధవారం జోరుగా రేషన్ దందా, పట్టించుకోని అధికారులు అనే శీర్షికతో ప్రచురితమైన కథనంపై జిల్లా అధికార యంత్రాంగం స్పందించింది. ఈ సందర్భంగా కల్లూరు ఆర్డీఓ మాట్లాడుతూ చౌకదుకాణాల ద్వారా రేషన్ పొందిన లబ్ధిదారులు ఎవరైనా అట్టి రేషన్ సన్న బియ్యం దళారులకు అమ్మినట్లు తమ దృష్టికి వస్తే విచారణ జరిపి వారి కార్డులు రద్దు చేయడం జరుగుతుందన్నారు. దళారులు ఎవరైనా రేషన్ షాపుల డీలర్ల వద్ద, లబ్ధిదారుల వద్ద తగిన ఆశా చూపటం, లేదా గ్రామాలలో డోర్ టు డోర్ తిరిగి తక్కువ ధరకు ప్రభుత్వం పంపిణీ చేసిన సన్న బియ్యాన్ని సేకరించి అక్రమంగా నిల్వ చేసిన, అమ్మినచో వారిపై క్రిమినల్ కేసు పెట్టి కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రేషన్ షాపు డీలర్లు ఎవరైనా ప్రభుత్వ రేషన్ బియ్యాన్ని అక్రమంగా దళారులకు అమ్మినట్లు రుజువైతే సదరు రేషన్ షాపు రద్దు చేయడంతో పాటుగా వారిపై కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు. రేషన్ బియ్యం అక్రమ దందా నిర్మూలనపై ప్రజలు సహకరించాలని ఆర్డీఓ విజ్ఞప్తి చేశారు.

రేషన్ డీలర్లలో గుబులు....

అక్రమంగా రేషన్ దందా వ్యాపారం జోరుగా సాగుతున్న విషయమై ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై పలు గ్రామాల్లోని రేషన్ డీలర్లలో గుబులు పట్టుకుంది. ప్రభుత్వం పేదలకు అందిస్తున్న సన్న రకం బియ్యాన్ని కొంతమంది రేషన్ డీలర్లు దళారులకు అమ్మి పెద్దమొత్తంలో సొమ్ము చేసుకుంటున్నారు. ఇలా మధిర, గంపలగూడెం, ఏపీలోని ప్రక్కన గల ఎన్టీఆర్ జిల్లా ప్రాంతానికి చెందిన దళారులు నేరుగా పలు గ్రామాల్లో అక్రమంగా నిల్వ ఉంచిన స్థావరాల వద్దకు వచ్చి బియ్యం వ్యాన్లలో తరలిస్తున్నారు. ప్రధానంగా అర్ధరాత్రి సమయంలోనే ఈ దందా సాఫీగా సాగుతున్నట్లు సమాచారం. ఈ అక్రమ దందా నియంత్రణలో మండల స్థాయి అధికార యంత్రాంగం కూడా తమకు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలా అక్రమంగా రేషన్ బియ్యం తరలింపునకు పాల్పడుతున్న కొంతమంది డీలర్లకు ఆంధ్రజ్యోతిలో బుధవారం ప్రచురితమైన కథనం దడ పుట్టిస్తున్నట్లు సమాచారం. ఇకనైన అధికారి యంత్రాంగం సరియైన దిశగా దృష్టి సారిస్తే రేషన్ బియ్యం దందాను నిర్మూలించడం పెద్ద సమస్య కాదని పలువురు భావిస్తున్నారు.

సెక్యూరిటీ ఉద్యోగం రాలేదని.. యువకుడి ఆత్మహత్యాయత్నం

» చావుబతుకుల మధ్య భద్రాచలం ఆస్పత్రిలో చికిత్స

» తన చావుకు ప్రైవేట్ ఏజెన్సీ వారే కారణమంటూ నోట్

» ఉపాధి కోసం అప్పులు చేసి మరీ లంచం ఇచ్చానని వెల్లడి



ప్రాణాపాయ స్థితిలో ఉన్న పూనెం సంప్రీత్

మణుగూరు/ పినపాక, జూలై 2 (ఆంధ్రజ్యోతి): సింగరేణి మణుగూరు ఏరియాలో ప్రైవేట్ సెక్యూరిటీగా ఉపాధి పొందేందుకు ఏజెన్సీ వారికి అప్పులు చేసి మరీ లంచాలు ఇచ్చాడు. కానీ ఆ ఉపాధి రాకపోవడంతో మనోవేదనకు గురైన ఓ యువకుడు బుధవారం ఆత్మహత్యాయత్నం చేశాడు. ప్రస్తుతం ప్రాణాపాయ స్థితిలో ఉన్న అతడు భద్రాచలంలో చికిత్స పొందుతున్నాడు. పినపాక మండలం పోట్లపల్లి గ్రామానికిచెందిన 30ఏళ్ల వయసున్న పూనెం సంప్రీత్ రెండేళ్ల క్రితం సింగరేణిలో సెక్యూరిటీ గార్డు ఉద్యోగం కోసం మురళీ మ్యాన్ పవర్ సెక్యూరిటీ ఏజెన్సీని ఆశ్రయించాడు. ఆ ఉద్యోగం ఇప్పించేందుకు గాను సెక్యూరిటీ ఏజెన్సీ నిర్వాహకుడైన అమరేందర్‌రెడ్డి అనే వ్యక్తికి ఫోన్ పే ద్వారా రూ.లక్షన్నర వరకు పలు మార్లు జమ చేశాడు. ఇంకా రూ.30వేలు ఇవ్వాలని ఒత్తిడి చేస్తున్నాడు. పైగా రెండేళ్లుగా సెక్యూరిటీ ఉద్యోగం రాక పోవడంతో సు ప్రీత్ ఇటీవల పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది. అయినా మిగులు డబ్బులు ఇవ్వాలని ఒత్తిళ్లు చేస్తుండటంతో బుధవారం ఉదయం పొలం వద్దకు వెళ్లిన సుప్రీత్ అక్కడ గడ్డి మందు తాగి ఇంటికి చేరుకున్నాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే మణుగూరులోని ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడినుంచి మెరుగైన వైద్యం కోసం భద్రాచలం ఆసుపత్రికి తరలించారు. అయితే సుప్రీత్ వద్ద మణుగూరు వైద్యులకు ఓ సూసైడ్ నోట్ లభించగా దాన్ని వారు పోలీసులకు అప్పగించినట్టు సమాచారం. తన చావుకు కారణం మురళీ మ్యాన్ పవర్ ఏజెన్సీ అని, లంచం కోసం వేధించడం, తాను చేసిన అప్పులే కారణమని, మురళీ, వెంకట్, మణికంఠ, అమరేందర్ రెడ్డి అనే వారి పేర్లు, సెల్ నెంబర్లు సహా రాయడం చర్చనీయాంశమైంది.

పాతఇనుము దుకాణాలకు తరలుతున్న సింగరేణి ఐరన్

● ఆటో స్వాధీనం

రుద్రంపూర్, (సింగరేణి) జూలై 2 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కొత్తగూడెం ఏరియాకు సంబంధించిన విలువైన ఐరన్‌ను పాత ఇనుము దుకాణాలకు సింగరేణిలో పని చేసే ప్రైవేట్ సిబ్బందే తరలిస్తున్న ఉదంతం వెలుగుచూసింది. కొత్తగూడెం ఏరియా ఆర్‌సీహెచ్‌పీలో ఉన్న ఐరన్ బిట్లను ఆటోలో బుధవారం రామవరంలోని పాత ఇనుము దుకాణానికి తరలిస్తుండగా, సింగరేణి సెక్యూరిటీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సింగరేణి కార్పోరేట్ జూనియర్ సెక్యూరిటీ అధికారి నారాయణ రెడ్డి తన సిబ్బందితో వెళ్లి ఆటోలో తరలిస్తున్న ఐరన్‌బిట్లను స్వాధీనం చేసుకుని పోలీసులకు అప్పగించారు. స్వాధీనం చేసుకున్న ఐరన్‌బిట్ల విలువ రూ.30వేలకుపైగా ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. సింగరేణిలో పని చేసే కాంట్రాక్టు కార్మికుడే ఈ చోరీలో కీలకపాత్ర పోషించినట్లు తెలుస్తోంది. ఐరన్‌బిట్లను స్వాధీనం చేసుకున్న సెక్యూరిటీ సిబ్బందిని సీనియర్ సెక్యూరిటీ అధికారి జాకీర్ హుస్సేన్ అభినందించారు.

మున్నేరులో బాలుడి గల్లంతు



మున్నేరులో గాలిస్తున్న ఎన్డీఆర్ఎఫ్ బృందం

ఖమ్మం రూరల్, జూలై 2(ఆంధ్రజ్యోతి): మున్నేరులో ఈతకు వెళ్లిన ఓ బాలుడు గల్లంతైన సంఘటన ఖమ్మం రూరల్ మండలం పోలేపల్లి పరిధిలోని మున్నేరులో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం పట్టనానికి చెందిన ఎస్‌కే. అహ్మద్ (14), హరికృష్ణ, ఉస్మాన్, ఫజల్ బాబు అనే నలుగురు స్నేహితులు కలిసి మంగళవారం సాయంత్రం మున్నేరులో ఈతకు వెళ్లారు. మున్నేరులోకి నలుగురు దిగి ఈత కొట్టే సమయంలో అహ్మద్ నీట మునిగిపోయి గల్లంతయ్యాడు. ఇది గమనించిన తోటి యువకులు అహ్మద్ కుటుంబ సభ్యులకు తెలిపారు. దీంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేయగా బుధవారం ఉదయం నుంచి గజ ఈతగాళ్లు, ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది మున్నేరులో గాలింపు చేపట్టారు. సాయంత్రం వరకు గాలించినప్పటికీ అహ్మద్ ఆచూకీ లభ్యం కాలేదు. గురువారం కూడా పోలీసులు గాలింపు చేపట్టనున్నట్లు ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపారు.

పురిటిలోనే శిశువు మృతి

» నిర్లక్ష్యం వహించిన ప్రభుత్వ ఆస్పత్రి వైద్యురాలిపై కేసు నమోదు

పాల్వంచ, జూలై 2 (ఆంధ్రజ్యోతి): పురిటిలోనే శిశువు మృతి చెందిన ఘటనపై పోలీసులు స్పందించారు. నిర్లక్ష్యాన్ని కారణంగా చూపుతూ సదరు ప్రభుత్వ వైద్యురాలిపై బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. లక్ష్మీదేవిపల్లి మండలం తోకబందాల గ్రామానికి చెందిన కోరం రాంప్రసాద్ తన భార్య కరుణకు పురిటి నొప్పులు రావడంతో తన అత్తగారి గ్రామమైన పాల్వంచ మండలం మందెరికలపాడు నుంచి మంగళవారం ఉదయం పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చాడు. వైద్యులు ఆమెను పరీక్షించి బిడ్డ ఆరోగ్యంగా ఉందని, సాధారణ కాన్పు అవుతుందని చెప్పారు. గర్భిణీతో వ్యాయామం చేయించారు. పరిస్థితులు చేయి దాటిన తరువాత చివరకు గైనకాలజిస్ట్ అనూషలక్ష్మి ఆపరేషన్ చేయడంతో కడుపులోనే శిశువు మృతి చెందాడు. దీంతో రాంప్రసాద్ తన బిడ్డ చావుకు వైద్యుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపిస్తూ పాల్వంచ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అతని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ ఎస్ఐ సుమన్ తెలిపారు.

గర్భం దాల్చిన 15ఏళ్ల బాలిక!

యువకుడిపై పోక్సో కేసు నమోదు

కామేపల్లి, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : ఓ యువకుడి మాయమాటలు నమ్మిన 15ఏళ్ల బాలిక గర్భం దాల్చిన సంఘటన కామేపల్లి మండలంలో జరిగింది. కామేపల్లి మండలంలోని ఓ గ్రామానికి చెందిన 17 ఏళ్ల బాలుడు.. మండల పరిధిలోని మరో గ్రామానికి చెందిన బాలికతో పరిచయం పెంచుకున్నాడు. ఈ క్రమంలో మాయమాటలు చెప్పి ఆమెను శారీరకంగా లోబరుచుకున్నాడు. రెండు రోజుల క్రితం ఆమెకు కడుపునొప్పి రావడంతో తల్లిదండ్రులు ఆసుపత్రికి తీసుకెళ్లగా గర్భవతి అని తేలడంతో జరిగిన విషయంపై ఆరా తీశారు. ఓ బాలుడు ఆమెకు మాయమాటలు చెప్పి ఈ దాష్టీకానికి పాల్పడినట్లు తెలియడతో బాలిక తల్లిదండ్రుల పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి.. ఆ బాలికను బాల సదన్‌కు తరలించారు.

మూడోతరగతి బాలికపై లైంగిక దాడి

బోనకల్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): మూడోతరగతి బాలికపై ఓ యువకుడు లైంగిక దాడికి పాల్పడిన సంఘటన బోనకల్ మండలంలోని ఓ గ్రామంలో జరగింది. బాలిక తల్లి ఫిర్యాదుతో బుధవారం ఆ యువకుడిపై ఫోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పొదిలి వెంకన్న తెలిపారు. ఓ గ్రామానికి చెందిన మూడవ తరగతి బాలిక ఇంటి వద్ద ఆడుకుంటుండగా లక్ష్మీకాంత్ అనే వ్యక్తి బలవంతంగా ఆ బాలికను తన ఇంటి వెనుకకు తీసుకెళ్లి లైంగిక దాడి చేశాడు. ఆ బాలిక ఏడ్చుకుంటూ ఇంటి రాగా.. విషయం తెలుసుకున్న బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఏసీపీ అబ్దుల్ రెహమాన్ గ్రామానికి వెళ్లి విచారణ నిర్వహించారు. లక్ష్మీకాంత్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదుచేశారు.

తిప్పనపల్లిలో కోళ్ల దొంగతనం



దొంగలు దాచిపెట్టిన కోళ్లు

చంద్రుగొండ, జూలై 2(ఆంధ్రజ్యోతి): పలు ఇళ్లల్లో కోళ్లను దొంగిలించి వాటిని బాత్రూంల్లో దాచిన ఘటన మండల పరిధిలోని తిప్పనపల్లిల్లో చోటు చేసుకుంది. కోళ్ల యజమానులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు గ్రామంలోని పది ఇళ్లల్లో సుమారు 100 కోళ్లను దొంగిలించి వాటిని గ్రామ మసీద్‌లోని పలు బాత్రూంల్లో దాచిపెట్టారు. కాగా మసీద్‌లో అలికిడికి చుట్టు పక్కలవారు నిద్రలేసి చూసే సరికి దొంగలు కోళ్లను వదిలిపెట్టి పారిపోయారు. విషయం తెలుసుకున్న గ్రామస్థులు మసీద్ వద్దకు చేరుకొని దొంగల కోసం పరిసరాల్లో కొంత సేపు వెతుకులాడారు. కోళ్ల యజమానులు ఎవరికోళ్లను వారు ఇంటికి తీసుకుపోయారు. ఈ విషయంపై స్థానిక ఎస్ఐ శివరామకృష్ణను వివరణ కోరగా ఎవరు ఫిర్యాదు చేయలేదని, గ్రామాల్లో పెట్రోలింగ్ పెంచుతామని తెలిపారు.



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఇందిరమ్మ రాజ్యంలో గ్రామ స్వరాజ్యం

- అర్హులందరికీ సంక్షేమ పథకాలు
- నిరుపేదలకు తొలి విడతలోనే ఇందిరమ్మ ఇళ్లు
- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- చిమ్మపూడిలో రూ.6.50కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

రఘునాథపాలెం, జూలై 2(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మరాజ్యంలో.. గ్రామస్వరాజ్యం రాజ్యమేలుతోందని, కాంగ్రెస్ ప్రభుత్వం హయంలోనే గ్రామాలు అభివృద్ధి జరుగుతాయని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. పూరిల్లు లేని మండలంగా రఘునాథపాలేన్ని తీర్చిదిద్దుతానని మంత్రి హామీ ఇచ్చారు. బుధవారం చిమ్మపూడిలో రూ.6.50కోట్లతో నిర్మాణం చేయనున్న రహదారులు, సీసీ రోడ్లు, డ్రెయినేజీ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు జరిగిన సభలో ప్రసంగించారు. గతంలో చిమ్మపూడికి రహదారులే లేవని, గ్రామంలో అన్నిమౌలిక సౌకర్యాలు కల్పిస్తామన్నారు. విద్యార్థులకు మంచి నాణ్యమైన విద్యను అందించేందుకు స్వామినారాయణ పాఠశాల త్వరలో ప్రారంభం కాబోతోందన్నారు. గ్రామాలు పచ్చగా పరిశుభ్రంగా ఉంటే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. కులమత రాజకీయాలకు అతీతంగా ప్రజలు సామరస్యంగా ఉండాలని కోరారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఖమ్మం ఏఎంసీ చైర్మన్ యరగర్ల హనుమంతరావు, జెడ్పీ సీఈవో దీక్షారైనా, మండల కాంగ్రెస్ కన్వీనర్ వాంకుడోత్ దీప్లానాయక్ పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి రూ.లక్ష సాయం



బాండ్‌ను అందిస్తున్న పూర్వవిద్యార్థులు

ఖమ్మంఖానాపురం హవేలి, జూలై2 (ఆంధ్రజ్యోతి): పూర్వవిద్యార్థులు తోటి మిత్రుడి కుటుంబాన్ని ఆదుకున్నారు. నగరంలోని వివేకనంద పాఠశాలలో 1991-92 విద్యాసంవత్సరంలో పదోతరగతి చదివిన జి.వెంకటేశ్వర్లు ఇటీవల ఆకస్మికంగా మృతచెందాడు. దీంతో పూర్వ విద్యార్థులందరు కలిసి రూ.లక్షరూపాయల ఎల్ఐసీ బాండ్ రూపంలో డిపాజిట్ చేశారు. బుధవారం మృతుడి కుటుంబ సభ్యులకు ఈ బాండ్ అందించారు. ఈ కార్యక్రమంలో కనకయ్య, రవి, సూర్యప్రకాష్, సైదారెడ్డి పాల్గొన్నారు.

గ్రంథాలయ అధికారిపై విచారణ

- కలెక్టర్ ఆదేశాలతో వివరాలు సేకరిస్తున్న అధికారులు
- నగర జీతభత్యం నిధుల్లో రూ.15 లక్షల స్వాహా?

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం

ఖమ్మం రూరల్, జూలై2 (ఆంధ్రజ్యోతి): నగరంలో నడుస్తున్న రూరల్ గ్రంథాలయ అధికారిపై కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి విచారణకు ఆదేశించారు. 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'రూరల్ గ్రంథాలయం...నగరం'లో అనే కథనానికి ఆయన స్పందించారు. ఖమ్మంరూరల్ మండలంలో ఉండాల్సిన గ్రంథాలయాన్ని 25ఏళ్లుగా ఖమ్మం పట్టణం రోటరీనగర్‌లోని ఓ పార్క్‌లో గదిలో గుట్టు చప్పుడు కాకుండా నిర్వహిస్తుండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతేకాక ఈ గ్రంథాలయాన్ని ఖమ్మం రూరల్ మండలానికి మార్చాలని జిల్లా అధికారులను ఆదేశించినట్లు విశ్వసనీయ సమాచారం. జిల్లా గ్రంథాలయ కార్యదర్శి కరుణ ఈ విచారణ నిర్వహిస్తున్నారు.

నిధులు మాయం

రూరల్ ప్రాంతాల్లో నిర్వహించే గ్రంథాలయాలకు ప్రభుత్వం ప్రత్యేక నిధులను మంజురు చేస్తుంది. ఈ నేపథ్యంలో ఖమ్మంరూరల్ గ్రంథాలయానికి నగర జీతభత్యం కింద ఏడాదికి రూ.60,000 మంజురు చేస్తుంది. ఇలా 25ఏళ్లకు సుమారు రూ.15లక్షల నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులను సదరు అధికారి స్వాహా చేసినట్లు బలమైన ఆరోపణలు వినిపిస్తున్నాయి. పోటీ పరీక్షలకు సన్నద్ధం కావాల్సిన నిరుద్యోగ యువత ఒక్కరు కూడా ఖమ్మం రూరల్ గ్రంథాలయానికి హాజరైన ధాఖాలాలు లేవు. రూరల్‌గ్రంథాలయం ఖమ్మంలో నిర్వహించడం మూలంగా అధికారికి తప్ప నిరుద్యోగ యువతకు ఏమాత్రం ఉపయోగపడటం లేదని యువకులు ఆరోపిస్తున్నారు.

విచారణ జరుపుతున్నాం

కరుణ, జిల్లా గ్రంథాలయ కార్యదర్శి

ఖమ్మం రూరల్ గ్రంథాలయాన్ని మండలానికి మార్చాలని కలెక్టర్ నుంచి స్పష్టమైన ఆదేశాలు అందలేదు. ఆదేశాలు వచ్చిన తరువాత మారుస్తాం. గ్రంథాలయ అధికారిపై విచారణకు ఆదేశించారు. దీనిపై వివరాలు సేకరిస్తున్నాం. విచారణ చేసి కలెక్టర్‌కు పూర్తి నివేదిక అందజేస్తాం.

సూపరింటెండెంట్‌కు ఉద్యోగోన్నతి



ఖమ్మంలీగల్, జూలై2(ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి కోర్టులో పనిచేస్తున్న సీనియర్ సూపరింటెండెంట్ మట్టా రవీందర్‌కు ఉద్యోగోన్నతి లభించింది. చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఒకటో అదనపు జిల్లా కోర్టుకు బదిలీ అయ్యారు. ఈమేరకు హైకోర్టు బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

సీపీఎం నాయకుడికి పరామర్శ

ఖమ్మంరూరల్, జూలై2(ఆంధ్రజ్యోతి): సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు, వైరా డివిజన్ కార్యదర్శి భూక్య వీరభద్రం ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న రూరల్ మండలానికి చెందిన సీపీఎం నాయకులు సిద్దినేని కోటయ్య, జిల్లా కమిటీ సభ్యులు నండ్రా ప్రసాద్, నాయకులు సుధాకర్, కృష్ణ తదితరులు బుధవారం వీరభద్రాన్ని పరామర్శించారు.

సమస్యలు పరిష్కరించాలి: ఏఐఎస్‌ఎఫ్

ఖమ్మంరూరల్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి రామకృష్ణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి బుధవారం వినతి పత్రం అందజేశారు. మద్దులపల్లిలోని జేఎన్టీయూ కళాశాలకు భవనాల కొరత ఉందన్నారు. రెగ్యూలర్ ఫాకల్టీ, ల్యాబ్స్, గ్రంథాలయం లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వివరించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో శివ నాయక్, మనోజ్ వంశి, గోపి, నరేష్ ఉన్నారు.



మంత్రి పొంగులేటికి వినతిపత్రం ఇస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

మహిళల ఫిర్యాదులపై తక్షణమే చర్యలు చేపట్టాలి

- పోలీస్ కమిషనర్ సునిల్ దత్
- మహిళా పోలీస్ స్టేషన్ తనిఖీ

ఖమ్మంఖానాపురంహవేలి, జూలై2(ఆంధ్రజ్యోతి): మహిళల ఫిర్యాదులపై తక్షణమే చర్యలు చేపట్టాలని పోలీస్ కమిషనర్ సునిల్ దత్ పోలీస్ అధికారులను ఆదేశించారు. బుధవారం నగరంలోని మహిళా పోలీస్ స్టేషన్‌ను సీపీ తనిఖీ చేశారు. నిర్వాహణ, పెండింగ్‌లో ఉన్న కేసులు, దర్యాప్తు, చార్జిషీట్ రికార్డులు, సీడీఫైళ్లను పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం సీపీ మాట్లాడుతూ మహిళా భద్రతకు మరింత ప్రాధాన్యత కల్పించాలని, వారు ఇచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించి, వారి రక్షణకు చర్యలు చేపట్టాలన్నారు. మహిళాల సమస్య పరిష్కారంలో భాగంగా మహిళా పోలీసు స్టేషన్ ఆశ్రయించే మహిళలు వారు చేసే ఫిర్యాదులపై తక్షణమే చర్యలు చేపట్టాలన్నారు.పోలీసు స్టేషన్‌కు వచ్చే మహిళలతో మర్యాదగా మాట్లాడాలని, ఫిర్యాదుల పట్ల సానుకూలంగా స్పంచింది, చట్ట పరిధిలో చర్యలు చేపట్టాలన్నారు. అదేవిధంగా వివిధ కళాశాలలు, పాఠశాలలను, మహిళలు ఎక్కువగా ఉండే ప్రాంతాలను మహిళా పోలీసు సిబ్బంది సందర్శించి చట్టాల పట్ల అవగాహన కల్పించాలన్నారు. ఆపదలో పోలీసుల సహకారం పొందే విధానం పట్ల అవగాహన కల్పించాలన్నారు.



సూచనలు ఇస్తున్న సీపీ

సస్యరక్షణపై అవగాహన పెంచుకోవాలి

- కేంద్రీయ సమగ్ర సస్యరక్షణ కేంద్రం అధికారులు



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఖమ్మంరూరల్,జూలై2(ఆంధ్రజ్యోతి): పత్తిలో సస్యరక్షణ పద్ధతులపై రైతులు అవగాహన పెంచుకోవాలని కేంద్రీయ సమగ్ర సస్యరక్షణ కేంద్రం హైదరాబాద్ అధికారి వెంకటరెడ్డి రైతులకు సూచించారు. మండల పరిధిలోని వెంకటాయపాలెం గ్రామంలో పత్తి రైతులకు గులాబీ రంగు పురుగు సమగ్ర సస్య రక్షణపై అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఎకరానికి 5 లింగాకర్షక బుట్టలు పెట్టుకుని గులాబీ రంగు పురుగు ఉనికిని గుర్తించాలన్నారు. ముందుగా వేపనూనెతో పిచికారి చేయాలన్నారు. తర్వాత కూడా ఉధృతి ఎక్కువగా ఉంటే రసాయన మందులు వాడాలని సూచించారు. అసిస్టెంట్ ప్లాంట్ ప్రొటెక్షన్ అధికారి ఉదయ శంకర్ మాట్లాడుతూ రసాయన పురుగు మందులు వాడేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. విత్తన శుద్ధి ఉపయోగాలను మరో అధికారి హోన్నప్ప వివరించారు. మిత్ర పురుగులు మరియు ట్రైకోకార్డ్ పరాన్న జీవుల ఉపయోగాల గురించి ఏపీఎస్ ఎస్‌మొబైల్ ఆప్‌వాడి సస్యరక్షణ పద్దతుల గురించి తెలుసుకోవాలన్నారు. అనంతరం ఏవో ఉమానగేష్ మాట్లాడుతు నానో యూరియా మరియు నానో డీఏపి వాడకం వలన ఉపయోగాలు, మోతాదు పిచికారి చేసే సమయం గురించి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

మున్నేరులో డీఆర్ఎఫ్ బలగాలకు శిక్షణ



ఖమ్మంకార్పొరేషన్, జూలై2(ఆంధ్రజ్యోతి): మున్నేరు నదిలో ఎన్డీఆర్ఎఫ్ బలగాలు డీఆర్ఎఫ్ బలగాలకు శిక్షణ ఇచ్చారు. గురువారం ఎన్డీఆర్ఎఫ్‌కు చెందిన బలగాలు మున్నేరు పరివాహక ప్రాంతంలోని పడవలతో ట్రయల్ రన్ చేపట్టారు. మున్నేరుకు కొద్ది కొద్దిగా వరద తీవ్రత పెరగటంతో బలగాలు అప్రమత్తమయ్యాయి. పడవలకు గాలి పెట్టటం నుంచి అత్యవసర సమయంలో పడవలను నడిపే విధానాలపై శిక్షణ ఇచ్చారు.

50మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ఖమ్మంసంక్షేమవిభాగం, జూలై2(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు అండగా నిలుస్తోందని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురామరెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఖమ్మం క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో 50మంది బాధితులకు రూ.11.50 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావుతో కలిసి పంపిణీ చేశారు. నాయకులు నాయకులు కొప్పుల చంద్రశేఖర్ పాల్గొన్నారు.



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎంపీ, రాయల

వీరభద్రానికి పరామర్శ

కామేపల్లి: కామేపల్లి పీఏసీఎస్ చైర్మన్, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు పుచ్చకాయల వీరభద్రాన్ని ఎంపీ రామసహాయం రఘురామిరెడ్డి పరామర్శించారు. ఇటీవల వీరభద్రం మాతృమూర్తి అంకమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. ఆమె చిత్రపటానికి నివాళ్లు అర్పించారు. ఆయనతో పాటు ఏపూరి పెద్దమల్లికార్జున్, ఏపూరి చిన్నమల్లికార్జున్‌రావు ఉన్నారు.

పేదలకు అండ సీఎం రిలీఫ్ ఫండ్

యువజన కాంగ్రెస్ నేలకొండపల్లి మండల అధ్యక్షుడు నాగరాజు

నేలకొండపల్లి, జూలై2(ఆంధ్రజ్యోతి): పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ అండగా ఉంటోందని యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యడవల్లి నాగరాజు కోరారు. అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పేదలకు సీఎం సహాయ నిధి నుంచి అందుతున్న సహాయం ఎంతో ఊరటనిస్తున్నదన్నారు. మండల పరిధిలోని పైనంపల్లికి చెందిన పేరం నర్సమ్మకు మంత్రి శ్రీనివాసరెడ్డి సిఫారసుతో మంజూరైన రూ.25వేల చెక్కును బుధవారం నాగరాజు బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో మారగాని అంజయ్య, యడవల్లి సైదులు, మారగాని గోవర్ధన్, పేరం నాగరాజు, సురేంద్రాచారి పాల్గొన్నారు.



చెక్కును అందిస్తున్న నాగరాజు

రుద్రాక్షల ఎగ్జిబిషన్ ప్రారంభం



ఖమ్మంఖానాపురంహవేలి జూలై2 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరం బైపాస్‌రోడ్‌లోని ఆర్ఆర్ఆర్ ఫంక్షన్ హాల్లో నేపాల్ రుద్రాక్షల ప్రదర్శన ప్రారంభించారు. ఈ ప్రదర్శనలో ఏకముఖ రుద్రాక్ష నుంచి 21 ముఖముల రుద్రాక్షల వరకు అందుబాటులో ఉన్నాయని నిర్వాహకుడు ఓంశ్రీ నేపాల్ రుద్రాక్ష ఆర్గనైజేషన్ మేనేజింగ్ డైరక్టర్ దుర్గాప్రసాద్ తెలిపారు. కరుంగళి, స్పటిక, నవరత్న మాలలు, సాలిగ్రాంలు, దక్షణావృత శంకులు ఈ ప్రదర్శనలో ఉంచామని ఈనెల7 వరకు ప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలిపారు.

భవన నిర్మాణ కార్మిక సంఘం ఎన్నిక

జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా వెంకన్న, పుల్లయ్య



ఖమ్మంసంక్షేమవిభాగం,జూలై2(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రగతిశీల భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యవర్గాన్ని బుధవారంఎన్నుకున్నారు. సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా పేరబోయిన వెంకన్న, గోసు పుల్లయ్యను నియమించారు. ఉపాధ్యక్షుడిగా గొడుగు విజయ్, నీలకంటి వెంకటనర్సయ్య, పసుపులేటి నర్సింహారావు, పెదపాక వెంకన్న, కోశాధికారిగా నాగరాజు వీరితో పాటుగా 19మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో టీయూసీఐ జిల్లా కార్యదర్శి జీ రామయ్య మాట్లాడుతూ భవన కార్మికులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను రెట్టింపు చేయాలని డిమాండ్ చేశారు.

గువ్వలగూడెం మాజీ సర్పంచ్ కన్నుమూత



నేలకొండపల్లి, జూలై2(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గువ్వలగూడెం మాజీ సర్పంచ్ తుళ్లూరి భారతమ్మ(72) బుధవారం మధ్యాహ్నం మృతి చెందారు. 2001 నుంచి 2006 వరకు సీపీఎం నుంచి ఆమె గువ్వలగూడెం సర్పంచ్‌గా వ్యవహరించారు. మృతురాలికి పిల్లలు లేరు. భర్త గతంలోనే చనిపోయారు. రాష్ట్రగిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, బండి జగదీష్, శాఖమూరి రమేష్, వేగినాటి లక్ష్మీనర్సయ్య, గుడవర్తి నాగేశ్వరరావు నివాళులర్పించారు.

అదనపు పీపీగా శరత్‌కుమార్‌రెడ్డి



ఖమ్మంలీగల్, జూలై2(ఆంధ్రజ్యోతి): మొదటి అదనపు జిల్లా కోర్టు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా జమ్ముల శరత్‌కుమార్‌రెడ్డిని నియమించారు. డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ సాంబశివరెడ్డి నుంచి ఉత్తర్వుల పత్రాన్ని బుధవారం అందుకున్నారు. మానేరు కళాశాలలో చదివారు. జమ్ముల శరత్‌కుమార్ రెడ్డి 1999నుంచి జిల్లా కోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నాడు. న్యాయవాది గానే కాకుండా 2001లో ఖానాపురం హవేలి ఎంపీటీసీగా, 2005లో సహాయ ప్రభుత్వ న్యాయవాదిగా, తదుపరి న్యాయవాదిగా జిల్లా కోర్టులో పనిచేశారు. జిల్లా కాంగ్రెస్ లీగల్ సెల్ చైర్మన్‌గా పనిచేశారు.

సీపీఐ టూటౌన్ కార్యదర్శిగా సాంబశివారెడ్డి



ఖమ్మంసంక్షేమవిభాగం, జూలై2(ఆంధ్రజ్యోతి): సీపీఐ ఖమ్మం టూటౌన్ కార్యదర్శిగా యానాల సాంబశివారెడ్డిని ఎన్నికయ్యారు. గిరిప్రసాద్ భవన్‌లో బుధవారం జరిగిన నూతన కౌన్సిల్ సమావేశంలో ఆయనను మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ సమక్షంలో జరిగిన సమావేశంలో బోడా వీరన్న, ఎస్‌కే సైదా అధ్యక్షత వహించారు. సమావేశంలో పార్టీ నిర్మాణం, ప్రజాసమస్యలపై మరిన్ని పోరాటాలు చేపట్టాలని నిర్ణయించారు. టూటౌన్ సహాయ కార్యదర్శిగా బోడ వీరన్న, ఎస్‌కే సైదాలను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో నగర కార్యదర్శి ఎస్‌కే జానిమియా, కార్పొరేటర్ బీజీ క్లైమెంట్, మేకల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎస్సీ గురుకులాల్లో ఆహార నాణ్యత పరిశీలన

ఖమ్మంసంక్షేమవిభాగం, జూలై2(ఆంధ్రజ్యోతి): నగరంలోని సాంఘీక సంక్షేమ గురుకులాల్లో జిల్లా ఆహార నాణ్యతా ప్రమాణాల శాఖ అధికారులు బుధవారం తనిఖీలు చేశారు. భోజనం, చికెన్‌కర్రీ, మిల్ మేకర్ కర్రీతో పాటుగా వంటల్లో వాడిన పదార్థాల శ్యాంపిల్స్ సేకరించారు. వంట నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. జిల్లా గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్, ఇన్‌స్పెక్టర్లు లోకేష్, శరత్, పాల్గొన్నారు.



ఎస్సీ గురుకులంలో ఆహారాన్ని పరిశీలిస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు

సార్వత్రిక సమ్మె పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న టీయూసీఐ నాయకులు

ఖమ్మంసంక్షేమవిభాగం, జూలై 2(ఆంధ్రజ్యోతి): ఈనెల 9న నిర్వహించే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. పరిశ్రమల ప్రాంతంలో జరిగిన ఈ కార్యక్రమంలో టీయూసీఐ నగర కార్యదర్శి కే శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు లక్ష్మీనారాయణ, బొమ్మకంటి రమేశ్, కోటేశ్వరరావు, దేవిసింగ్, యాకూబ్, రామ్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నరసింహారావుకు ఎమ్మెల్సీ కవిత నివాళి



నివాళులర్పిస్తున్న కవిత

నేలకొండపల్లి,జూలై2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అందరూ కేసీఆర్‌ను తలుచుకుంటున్నారని ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. బుధవారం నేలకొండపల్లి మండలం, అప్పలనర్సింహాపురంలో తెలంగాణ జాగృతి నాయకురాలు నల్లమోతు అనితాచౌదరి తండ్రి నల్లబోతు నర్సింహా రావు దశదిన కర్మలో కవిత పాల్గొన్నారు. తొలుత మృతుడు నర్సింహారావు చిత్రపటానికి పూలమాలలేసి ఘన నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

పెంచిన రైల్వే చార్జీలను తగ్గించాలి



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

ఖమ్మంసంక్షేమవిభాగం, జూలై2(ఆంధ్రజ్యోతి): పెంచిన రైల్వే చార్జీలను వెంటనే తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. బుధవారం ఖమ్మం రైల్వే స్టేషన్ వద్ద కేంద్ర ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేశారు. లక్షల కోట్ల రైల్వే ఆస్తులను అంబానీ కంపెనీలకు ఇవ్వటానికి ప్రధాని ముందుకు వస్తున్నారని ఆరోపించారు. వై విక్రమ్, ఎంఏ జబ్బార్, తిరుపతిరావు, నవీన్‌రెడ్డి, సుదర్శన్, భూక్య శ్రీనివాసరావు, ఉపేందర్, నాగుల్‌మీరా, నాగసులోచన పాల్గొన్నారు.

తక్షణం జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలి



మాట్లాడుతున్న మాస్‌లైన్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు అశోక్

ఖమ్మం సంక్షేమ విభాగం, జూలై 2(ఆంధ్రజ్యోతి): తక్షణం జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆవుల అశోక్ డిమాండ్ చేశారు. బుధవారం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. అధికారంలోకి వచ్చి 16నెలలైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగాలు కల్పించలేక పోయిందన్నారు. నాయకులు ఝాన్సీ, కొల్లేటి నాగేశ్వరరావు, ఆవుల మంగతాయి, కే శ్రీను, ప్రతాపనేని శోభ, కేలోత్ లక్ష్మణ్, ఇమ్మిడి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



ఆంధ్రజ్యోతి
ZONE
గురువారం 3 జూలై 2025
వైరా-మధిర
సత్తుపల్లి
8
WYRA, MADHIRA, SATHUPALLY
● మధిర, ఎర్రుపాలెం, బోనకల్, చింతకాని, ముదిగొండ
● వైరా, కొణిజర్ల, కారేపల్లి, ఏన్కూరు , జూలూరుపాడు
● సత్తుపల్లి, కల్లూరు, తల్లాడ, వేంసూరు, పెనుబల్లి

వైరా రిజర్వాయర్‌లో చేపల వేట నిషేధం

వైరా, జూలై 2 (ఆంధ్రజ్యోతి): వైరా రిజర్వాయర్‌లో ఈ ఏడాది ఆగస్టు 31వతేదీ వరకు చేపల వేటను నిషేధిస్తూ జిల్లా మత్స్యశాఖ అధికారి జి.శివప్రసాద్ ఆదేశాలు జారీ చేశారు. చేపల పునరోత్పత్తి కాలం జూన్ 30నుంచి ఆగస్టు 31వరకు ఉంటుందని ఈ పునరోత్పత్తి కాలంలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం చేపల వేట నిషేధమని స్పష్టం చేశారు. చేపల వేట నిషేధాన్ని అతిక్రమించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అందువల్ల వైరా మత్స్య పారిశ్రామిక సహకార సంఘంలోని మత్స్యకారులు ఆగస్టు 31వరకు విధిగా చేపల వేటకు దూరంగా ఉండాలని, ఈ ఆదేశాలను పాటించాలని స్పష్టం చేశారు.

రాష్ట్రస్థాయి క్రీడలకు విద్యార్థుల ఎంపిక



రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికైన కల్లూరు విద్యార్థులు

కల్లూరు, జూలై 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర స్థాయి క్రీడా పాఠశాలల తరుపున కల్లూరు ప్రాంతానికి చెందిన పలువురు విద్యార్థులు తమ ప్రతిభను కనబరిచి ఎంపికయ్యారు. హైదరాబాద్‌లోని హకీంపేట క్రీడా పాఠశాలలో బుధ, గురువారాల్లో రెండు రోజుపాటుగా ఈ పోటీలు జరగనున్నాయి. సదరు విద్యార్థులు బ్యాటరీ టెస్ట్ పోటీలకు అర్హత సాధించారు. సదరు విద్యార్థులను మండల విద్యాశాఖ అధికారిణి పి. నివేదిత, వ్యాయామ విద్యా విభాగం కోఆర్డినేటర్ బోడ భీమా, పసుపులేటి వీర రాఘవయ్య అభినందించారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ఏన్కూరు, జూలై 2 (ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి, ఏబ్లాక్ అధ్యక్షుడు వేములకృష్ణ ప్రసాద్ అన్నారు. టీఎల్‌పేట గ్రామంలో బుధవారం 48మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులందరికి ఇందిరమ్మ ఇళ్లు వస్తాయన్నారు. మొదటి విడతలో టీఎల్‌పేట గ్రామ పంచాయతీకి 48ఇళ్లు వచ్చాయన్నారు. వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ నేతృత్వంలో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు జరుగుతున్నాయని, గ్రామాలు



ఇందిరమ్మ ఇళ్ల పట్టాలతో లబ్ధిదారులు

అభివృద్ధి చెందుతున్నాయన్నారు. మాజీ వైస్ ఎంపీపీ పాశం శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి కూరపాటి గోపి, మాజీ ఉపసర్పంచ్ గిద్దగిరి సత్యనారాయణ, పాశం వెంకటేశ్వర్లు, పంతగాని నరేష్, పంతగాని ప్రసాద్, పాలెం శేఖర్, జనార్ధన్ పాల్గొన్నారు

చిరుజల్లులతో పంటల కళకళ



ఎరువులు వేస్తున్న కూలీలు

ముదిగొండ, జూలై 2 (ఆంధ్రజ్యోతి): గత వారంరోజులుగా కురుస్తున్న చిరుజల్లులతో రైతుల్లో పంటల సాగుపై ఆశలు చిగురిస్తున్నాయి. నెలరోజుల క్రితం నుంచే భూములను దుక్కి దున్ని పంటలను సాగుచేసేందుకు సమాయత్తం చేశారు. అప్పటి నుంచి వర్షం ఎప్పుడు వస్తుందా అని ఆశగా ఎదురుచూసిన రైతులకు కొద్దిరోజులుగా కురుస్తున్న చిరుజల్లులు ఆశలు రేకెత్తించాయి. రుతుపవనాలు ముందుగా వచ్చాయని ఆశపడిన రైతులు పత్తి విత్తనాలు విత్తడంతో వర్షం కురవక విత్తిన పత్తి విత్తనాలు బూజు పట్టాయి. రైతులు రెండు,మూడుసార్లు పత్తి విత్తనాలు విత్తి నష్టపోయారు. ఈ తరుణంలో వారంరోజుల నుంచి కురుస్తున్న చిరుజల్లులతో నాల్గోసారి విత్తిన పత్తి విత్తనాలు మొలకెత్తాయి. దీంతో వాటిని ఎరువులు వేసి పాటుచేస్తున్నారు. మండలంలో ప్రధానంగా మిర్చి, పత్తి, కంది, పెసర, వరి పంటలను అధికంగా సాగుచేస్తారు. కురుస్తున్న వర్షాలకు పంటలు కళకళలాడుతుండడంతో రైతులు పనుల్లో నిమగ్నమయ్యారు.

నేడు జవహర్ ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన

- హాజరుకానున్న మంత్రులు భట్టి , ఉత్తమ్ కుమార్
- 33వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణకు రూ.600 కోట్లు కేటాయింపు
- జిల్లాలోనే ఖరీదైన ఎత్తిపోతల పథకంగా పేరు



కంపచెట్లతో ఉన్న సాగర్ కాలువ

మధిరటౌన్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): మధిర నియోజకవర్గంలోని మధిర, ఎర్రుపాలెం మండలాల్లో జోన్ 3లో ఉన్న సాగర్ ఆయకట్టును జోన్ 2లోకి మార్చి ఆయకట్టును స్థిరీకరించేందుకు 600 కోట్ల రూపాయలతో మధిర మండలం వంగవీడు గ్రామం వద్ద వైరా నదిపై జవహర్ ఎత్తిపోతల పథకం పేరుతో ఈనెల 3న రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. మధిర, ఎర్రుపాలెం మండల్లాలో సాగర్ కాలువలు తవ్వి దశాబ్దాలు కావస్తున్న పొలాలకు నీళ్లు పారాలంటే ఈ మండలాల్లోని ఆయకట్టు జోన్3 పరిధిలో ఉండడంతో డిసెంబర్ తరువాతనే నీళ్లు పారేవి. కాల్వలకు ఆంధ్రప్రదేశ్ లోని మైలవరం బ్రాంచ్ కెనాల్ నుంచి నీళ్లు రావలసి ఉండడంతో ఈ మండలాల పరిధిలోని భూములు టెయిల్‌ఎండ్‌లో ఉండడంతో అరకొరగానే నీళ్లు అందేవి. ఖమ్మం జిల్లా లోని సాగర్ ఆయకట్టు మొత్తం జోన్ 2లోనే ఉండడం ఖమ్మం జిల్లాలోనే ఉన్న మధిర, ఎర్రుపాలెం మండలాల్లోని ఆయకట్టు మాత్రం జోన్ 3లో ఉండడంతో జిల్లా అంతటికి ఆగస్టులో నీళ్లు విడుదల అయినా ఈ మండలాల్లో డిసెంబర్ లో నీరు విడుదల చేస్తుండడంతో రైతులు సాగునీటి ఎద్దడిని ఎదుర్కుంటున్నారు. ఆనాడు ఉమ్మడి రాష్ట్రంలోనే ఈ ఆయకట్టును జోన్3 నుంచి జోన్ 2కు మార్చేందుకు నాటి డిప్యూటీ స్పీకర్ హోదాలో స్థానిక శాసనసభ్యుడు భట్టి ప్రయత్నం చేసినప్పటికి రాష్ట్ర విభజనతో ఈ ప్రతిపాదన మరుగున పడింది. భట్టి ఉపముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన వెంటనే ఈ పథకానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి అంచనాలు పూర్తి చేయించి నేడు శంకుస్థాపనకు సిద్ధం చేస్తున్నారు. జోన్ 3లో ఆయకట్టుకు మధిర, ఎర్రుపాలెం మండలాలకు కేటాయించిన నిఖరజలాలను తల్లాడ మండలం రెడ్డిగూడెం సమీపంలో సాగర్ మెయిన్ కెనాల్ (21 ఎంబీసీ) 51.70 కి.మీటర్ నుంచి 500 క్యూసెక్కులు తీసుకుని ఈనీటిని వైరా నదిలోకి మళ్లించి, ఆ నీటిని మధిర మండలం వంగవీడు వద్ద చెక్‌డ్యాం తరహ మినీ రిజర్వాయర్, పంప్ హౌజ్‌లు నిర్మించి ఎత్తిపోతల పథకం ద్వారా మధిర మండలంలోని నాగవరప్పాడు వద్ద పైప్‌లైన్ ద్వారా నిదానపురం మేజర్ సాగర్ కాలువ లోకి నీటిని ఎత్తిపోయనున్నారు. అక్కడ నుంచి కాలువల ద్వారా కట్టలేరులోకి నీళ్లు మళ్లించి అయ్యవారిగూడెం వద్ద రెండు పంప్ హౌజ్‌లు నిర్మించి పైప్‌లైన్ ద్వారా మైలవరం బ్రాంచ్ కెనాల్‌కు, మరో పైప్‌లైన్ ద్వారా గుంటుపల్లిగోపారం వద్ద జమలాపురం బ్రాంచ్ కెనాల్ లోకి నీటిని ఎత్తిపోయనున్నారు. ఈ జవహర్ ఎత్తిపోతల పథకం ద్వారా మధిర మండలంలోని 13వేల ఎకరాలు, ఎర్రుపాలెం మండలంలోని 20వేల ఎకరాల సాగర్ ఆయకట్టును స్థిరీకరించనున్నారు. ఈ శంకుస్థాపన అనంతరం ఇద్దరు మంత్రులతోపాటు జిల్లా ఇంచార్జ్ మంత్రి శ్రీహరి మధిరలోని డిప్యూటీ సీఎం కార్యాలయంలో జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులపై సమీక్ష నిర్వహించనున్నారు.

మధిర సీఐ మధు బదిలీ



సీఐ మధు

మధిరటౌన్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): మధిర సర్కిల్ ఇనస్పెక్టర్‌గా పని చేస్తున్న దొంగరి మధును బదిలీ చేస్తు పోలీస్ శాఖ బుధవారం రాత్రి ఉత్తర్వులు విడుదల చేసింది. ఆయన మధిర సిఐగా మార్చి 2024 లో పదవీ బాధ్యతలు చేపట్టారు. ఆయనను హైదరాబాద్ లోని మల్టీ జోన్-1 ఐజీ ఆఫీస్ లో రిపోర్టు చేయవలసిందిగా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. మధు స్థానంలో కన్నం కుమార్ స్వామి మధిర సిఐగా రానున్నారు, ఈయన గతంలో బోనకల్ ఎస్ఐగా పని చేయగా ప్రస్తుతం రామగుండం కమీషనరేట్ పరిధిలో తాండూరు సిఐగా పనిచేస్తున్నారు.

పోట్రు లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్ట్ చేయూత..

- కార్మికులకు రెయిన్‌కోట్లు, విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు అందజేత

కల్లూరు, జూలై 2 (ఆంధ్రజ్యోతి): కల్లూరులో పోట్రు లక్ష్మయ్య మెమోరియల్ అండ్ చారిటబుల్ ట్రస్టు తరుపున బుధవారం పురపాలక కార్మికులకు రెయిన్‌కోట్లు, పలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు, పలకలు అందజేశారు. ట్రస్ట్ బాధ్యుడు పోట్రు ప్రవీణ్ జన్మదిన వేడుకల సందర్భంగా రూ. 50 వేల విలువల వస్తువులను పంపిణీ చేశారు. ట్రస్ట్ తరుపున పోట్రు కిరణ్, కాటేపల్లి రజనీలు వాటిని అందజేశారు. ఇంకాను చంద్రుపట్ల రహదారి వైపున గల అనాధ ఆశ్రమంలో గల పిల్లలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వక్తలు ప్రసంగిస్తూ.. కల్లూరు మండల పరిసర ప్రాంతాల్లో పలు రకాలుగా ఆ సంస్థ అధినేత ప్రవీణ్ చేపడు



తున్న సామాజిక సేవ కార్యాక్రమాలను అభినందించారు. వర్షాకాల సీజన్‌లో తమకు రేయిన్ డ్రెస్సెస్ అందజేసిన దాతలకు కార్మికులు కృతజ్ఞతలు తెలిపారు. ట్రస్ట్ నిర్వహాకులు గద్దే నరేష్, బీఆర్ఎస్ నాయకులు కొరకొప్పు ప్రసాద్, ఏనుగు అంజి, ఖమ్మంపాటి రమేష్, కొత్తపల్లి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పనులను పరిశీలించిన అదనపు కలెక్టర్

కారేపల్లి, జూలై 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న మరమ్మతు పనులను అదనపు కలెక్టర్ శ్రీజ బుధవారం పరిశీలించారు. వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ చొరవతో సింగరేణి సంస్థ కళాశాలలో మరమ్మతు పనుల కోసం 30 లక్షల నిధులు మంజూరు చేయగా బోర్డు ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ రూ.20లక్షల50వేలు మంజూరు చేసింది. మంజూరైన నిధులతో కళాశాలలో ఏఏ పనులు చేయించాలనే విషయాన్ని అదనపు కలెక్టర్ సంబంధిత అధికారులతో చర్చించారు. ఆమె వెంట డీఐవో రవిబాబు, పంచాయతీ రాజ్‌శాఖ అధికారులతో పాటు ప్రిన్సిపాల్ విజయకుమారి, ఎంపీడీవో



ప్రిన్సిపాల్‌తో మాట్లాడుతున్న శ్రీజ

సురేందర్, ఎంఈవో జయరాజు, ఎంపీవో రవీంద్రప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సంఖ్యతోపాటు కొత్త అడ్మిషన్ విషయాలపై ఆమె ప్రిన్సిపాల్‌ను అడిగి తెలుసుకున్నారు. కళాశాలలో విద్యార్థుల సంఖ్య పెంచాలని శ్రీజ సూచించారు.

నిబంధనలు పాటించని డీలర్లపై చట్టరీత్యా చర్యలు

- జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య

మధిర రూరల్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలని,నిబంధనలు పాటించని డీలర్లపై చట్టరిత్యా చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ధనసరి పుల్లయ్య హెచ్చరించారు. బుధవారం మధిరలోని ఫెర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ దుకాణాలను ఆయన స్థానిక వ్యవసాయ అధికారులతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. యూరియా కృత్రిమ కొరత సృష్టించకుండా తగినంతగా రైతులకు అందించాలన్నారు. నానో యూరియాను పైపాటుగా వాడాలని తెలిపారు. డీలర్లందరూ స్టాక్ బోర్డులు, స్టాక్ రిజిస్టర్లను ఎప్పటికప్పుడు నిర్వహించాలని సూచించారు. అనంతరం డీలర్లతో సమావేశాన్ని నిర్వహించారు. రాయపట్నం గ్రామంలో పచ్చిరొట్ట సాగుచేసిన పొలాలను సందర్శించిన రైతులతో మాట్లాడారు. పచ్చిరొట్ట విత్తనాల ప్రయోజనాలను రైతులకు వివరించారు. పచ్చిరొట్ట సాగువల్ల భూమిలో నత్రజని, పొటాష్ విలువలు పెరుగుతాయన్నారు. ఏడీఏ విజయ్‌చంద్ర, ఏవో సాయిదీక్షిత్, ఏఈవోలు పాల్గొన్నారు.

జానకీపురం స్కూల్ హెచ్ఎంకు మెమో జారీ

బోనకల్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జానకీపురం ఉన్నత పాఠశాల హెచ్ఎం శ్రీనివాసరావుకు బుధవారం సాయంత్రం జిల్లా విద్యాశాఖాధికారి సత్యనారాయణ మెమో జారీ చేశారు. జానకీపురం పాఠశాలను అదనపు కలెక్టర్ శ్రీజ ఆకస్మిక తనిఖీ సమయంలో హెచ్ఎం తన విధుల పట్ల నిర్లక్ష్య వైఖరి అవలంభించారని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. శాఖపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇందులో భాగంగానే జిల్లా విద్యాశాఖాధికారి నుంచి మెమో జారీ అయింది.

సైబర్ నేరాలపై అవగాహన

మధిర రూరల్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): మధిర మండలం ఆత్కూరులోని శ్రీనిధి కాన్సెప్ట్ స్కూల్లో బుధవారం ఏఎస్ఐ లచ్చు ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ బి.అంజన్‌బాబు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఆన్‌లైన్ మోసాలు, సోషల్‌మీడియా పట్ల జాగ్రత్త వహించాలని, వ్యక్తిగత సమాచార గోప్యత, ఫిషింగ్, మాల్వేర్ దాడులు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డైరెక్టర్ సీహెచ్.చందు, బి.శ్రీనివాసరావు, పోలీసు సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు బీరువా వితరణ

మధిర రూరల్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): మధిర మండలం అల్లీనగరం గ్రామానికి చెందిన సూర్యదేవర వినయ్‌కుమార్ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలకు రూ.15వేల విలువైన ఐరన్ బీరువాను వితరణ చేశారు. బుధవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో బీరువాను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మేకల శ్రీనివాసరావుకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దాతలు ఇచ్చే సహకారాన్ని విద్యార్థులు అందిపుచ్చుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. పాఠశాల ఉపాధ్యాయుడు స్వామి, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

కారేపల్లి తహసీల్దార్ సంపత్ బదిలీ

కారేపల్లి, జూలై 2 (ఆంధ్రజ్యోతి): మండల తహసీల్దార్ ఎస్.సంపత్ కుమార్ మహబుబాబాద్ జిల్లాకు బుధవారం బదిలీ అయ్యారు. గత పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఆయన కారేపల్లి మండలానికి వచ్చారు. 16నెలల పాటు ఆయన ఇక్కడ విధులు నిర్వహించారు. కాగా ప్రస్తుతం డీప్యూటి తసీల్దార్‌గా పనిచేస్తున్న కృష్ణయ్యకు తహసీల్ధారుగా బాధ్యతలు అప్పగించారు.

ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలి

ముదిగొండ, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంటిలో ఇంకుడుగుంతలు నిర్మించుకోవాలని సీడబ్ల్యూసీ టీం సభ్యుడు కె.పృథ్వీరాజ్, ఏపీడీ శ్రీదేవిలు సూచించారు. బుధవారం ముదిగొండ మండలం వల్లభి గ్రామంలో ఓ ఇంటిలో నిర్మించిన ఇంకుడుగుంతను వారు పరిశీలించారు. జేఎస్‌జేబీ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన ఇంకుడు గుంతల నిర్మాణాన్ని తాము పరిశీలించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్ గాలయ్య, ఈసీలు వెంకటేష్, కిరణ్, టీఏ రమేష్, పంచాయతీ కార్యదర్శి మురళీకృష్ణ పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఏన్కూరు, జూలై 2 (ఆంధ్రజ్యోతి): వర్షాలతో వాగులు పొంగిప్రవహిస్తున్నందున ప్రజలు, వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని మండల తహసీల్దార్ సీహెచ్ శేషగిరిరావు, ఎంపీడీవో నారాయణ, ఎస్ఐ రఫి కోరారు. రెండురోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు పలుచోట్ల వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. జన్నారం, ఆరికాయలపాడు మధ్య నిమ్మ వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఎలాంటి ప్రమాదాలు జరగకుండా



రాకపోకలకు అడ్డుగా చర్యలు చేపడుతున్న అధికారులు

మండల అధికారులు ఆ వాగుకు ఇరువైపులా ట్రాక్టర్లు అడ్డంగా ఏర్పాటు చేశారు. పంచాయతీ కార్యదర్శి రవి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మార్కెట్‌యార్డు అభివృద్ధికి కృషి చేస్తాం

బోనకల్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మార్కెట్ సబ్‌యార్డు అభివృద్ధి కోసం కృషి చేస్తామని ఏఎంసీ చైర్మన్ బండారు నరసింహారావు తెలిపారు. బోనకల్ వ్యవసాయ మార్కెట్ సబ్ యార్డు, చిరునోముల గోదాంను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సబ్ మార్కెట్ యార్డులో మౌలిక వసతుల కల్పన నిధుల కేటాయింపు కోసం తాను డిప్యూటీ సీఎం మల్లు భట్టీ విక్రమార్క దృష్టికి తీసుకెళ్లానని తెలిపారు. సబ్ మార్కెట్ యార్డులో షాపింగ్ కాంప్లెక్సుల నిర్మాణం, ప్రహరి గోడ, ఓపెన్ ప్లాట్‌ఫాంలు, గోదాంలకు మరమ్మత్తుల నిర్వహణను చెపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ డీఈఈ ఎల్లేష్, కార్యదర్శి చంద్రశేఖర్, ఏఎంసీ డైరెక్టర్లు అనుమోలు వెంకటేష్, వట్టికొండ రామకృష్ణ, కాంగ్రెస్ జిల్లా నాయకుడు పైడిపల్లి కిషోర్ కుమార్, మండల అధ్యక్షుడు గాలి దుర్గారావు పాల్గొన్నారు.



గోదాంను పరిశీలిస్తున్న ఏఎంసీ చైర్మన్ నరసింహారావు

ఏఐవైఎఫ్ నాయకుల ముందస్తు అరెస్ట్

చింతకాని, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో నేడు హైదరాబాద్‌లోని అమెరికా రాయబార కార్యాలయం ముట్టడికి వెళ్తున్న ఏఐవైఎఫ్ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో అబ్బూరి మహేష్, వడ్డె కిషోర్, కాంపెల్లి రమేష్, కనపర్తి సత్యనారాయణ ఉన్నారు.

ఎస్‌బీఐ మేనేజర్‌కు వీడ్కోలు సన్మానం

వైరా, జూలై 2 (ఆంధ్రజ్యోతి): బదిలీ అయిన వైరా టౌన్ ఎస్‌బీఐ మేనేజర్ వెంకటరెడ్డిని విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. వైరా మేనేజర్‌గా పని చేస్తున్న వెంకటరెడ్డి పాల్వంచలోని కిన్నెరసాని ఎస్‌బీఐ బ్రాంచ్‌కు బదిలీ అయ్యారు. ఆయన బదిలీ సందర్భంగా విశ్రాంత ఉద్యోగులు శాలువాతో సన్మానించి జ్ఞాపిక అందజేశారు. ఆసంఘం నాయకులు పైడిపల్లి సత్యనారాయణ, సీహెచ్ఎస్‌వీ.ప్రసాద్, జి.సుబ్బయ్య, షేక్.వలీజాన్, సామినేని వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వేధిస్తున్న యువకుడిపై కేసు నమోదు

బోనకల్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలకోట గ్రామానికి చెందిన ఓ యువతిని ప్రేమ పేరుతో వేదిస్తున్న వ్యక్తిపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పొదిలి వెంకన్న తెలిపారు. వైరాకు చెందిన ఆదూరి బాలు మండలంలోని కలకోట గ్రామంలో తన అమ్మమ్మ ఇంటికి తరుచు వస్తుంటాడు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన మౌనికను గత నాలుగేళ్లుగా ప్రేమ పేరుతో వెంట పడుతున్నాడు. పెళ్లి సంబంధాలు కుదుర్చుకున్న ప్రతిచోటకు వెళ్లి ఆమె తన ప్రేమికురాలు అని చెప్పి చెడగొడుతున్నాడు. గత నెల 30వ తేదిన యువతి నిశ్చితార్థం జరిపేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకోగా అంతకు ముందు రోజు పెళ్లి సంబంధం కుదుర్చుకున్న వారి ఇంటికి వెళ్లి తమ మధ్య ప్రేమ వ్యవహారం నడుస్తోందని చెప్పడంతో నిశితార్థం ఆగిపోయింది. విసిగిపోయిన బాధితురాలు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా బాలుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఎయిడ్స్ రహిత సమాజానికి కృషి చేయాలి



విద్యార్థులను అభినందిస్తున్న నిర్వాహకులు, కళాశాల యాజమాన్యం

సత్తుపల్లిరూరల్, జులై 2 (ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ రహిత సమాజానికి ప్రతిఒక్కరూ కృషిచేయాలని, అవగాహతోనే నివారణ సాధ్యమవుతుందని కాకతీయ యూనివర్సిటీ రిటైర్డ్ డీన్, ప్రొఫెసర్ పీ.నరసింహారావు అన్నారు. మండలంలోని మదర్‌థెరిస్సా ఫార్మసీ కళాశాలలో బుధవారం జేఎన్‌టీయూహెచ్, టీజీఎస్‌ఏసీఎస్, రెడ్ రిబ్బన్ క్లబ్-2025 ప్రోత్సాహంతో కళాశాలలో ఎన్ఎస్ఎస్ సెల్ ఆధ్వర్యంలో హెచ్ఐవీ నివారణ, వ్యాప్తి నిరోధక కార్యక్రమం నిర్వహించారు. హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాప్తి చెందకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి, నివారణ చర్యలుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎయిడ్స్ నివారణ, నియంత్రణ మండలి జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ హెచ్‌వీఎస్. సత్యకుమార్, ఛైర్మన్ కంచర్ల సత్యనారాయణ, సెక్రటరీ, కరస్పాండెంట్ చలసాని సాంబశివరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ చల్లా శ్రీనివాసరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కుమార్‌రాజా జయవరపు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ దాసరి ప్రవీణ్‌కుమార్, అధ్యాపక బృందం, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.


వర్షం వస్తే.. రోడ్డే చెరువు



రోడ్డు సెంటర్లో వరదనీరు

తల్లాడ, జూలై 2 (ఆంధ్రజ్యోతి): కొద్దిపాటి వర్షం కురిసిన వరద పోటెత్తడంతో తల్లాడ రింగురోడ్డు సెంటర్ తటాకాన్ని తలపిస్తోంది. దీంతో తల్లాడ -దేవరపల్లి, తల్లాడ-కుంట జాతీయ రహదారుల్లో వెళ్లే వాహనదారులకు ఇబ్బందికరంగా మారింది. రింగు రోడ్డు సెంటర్‌లోని జాతీయ రహదారుల్లో బస్సులు, లారీలు, కార్లు, వ్యాన్లు వంటి వాహనాలు వేగంగా వెళ్లేటప్పుడు ద్విచక్రవాహనదారులు, పాదచారులపై బురద నీరు పడుతుండడం, పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడం వంటి సమస్యలతో ప్రజలు సతమతమవుతున్నారు. సైడ్‌డ్రెయిన్లు లేకపోవడంతో సమస్య ఉత్పన్నమవుతుంది. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

సీపీఐ నాయకుడి మృతి



నివాళులర్పిస్తున్న నాయకులు

చింతకాని, జూలై 2 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వందనం గ్రామానికి చెందిన సీపీఐ నాయకుడు ఆవుల నాగరాజు(45) బుధవారం అనారోగ్యంతో మృతి చెందాడు. మృతదేహాన్ని నాయకులు సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

- టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు

పెనుబల్లి, జూలై 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. బుధవారం పెనుబల్లి మండల టీఎస్‌యూటీఎఫ్ కమిటీ ఆధ్వర్యంలో పబ్లిక్ జనరల్ ఫండ్ క్యాంపెయినింగ్ వీఎంబంజర్ పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన హామీలు ఒక్కటీ కూడా నెరవేర్చలేదని, హామీలు నీటిమూటలుగానే మిగిలాయని విమర్శించారు. కేజీబీవీ, యూఆర్ఎస్, ఆశ్రమ పాఠశాలల్లో కాంట్రాక్టు ఉద్యోగులకు బేసిక్ పే ఇవ్వాలని, ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం సమ్మెకాలానికి వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచటానికి ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున కృషిచేయాలని, బాధ్యతగా పనిచేసి విద్యారంగాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. కార్యదర్శి వీవీ.రామారావు, మండల అధ్యక్ష, కార్యదర్శులు వీరాస్వామి, కె.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు కె.రంగబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే కమ్యూనిస్టుల ధ్యేయం

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని

బోనకల్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే కమ్యూనిస్టుల ధ్యేయమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు తెలిపారు. మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో బుధవారం రాత్రి జరిగిన కామ్రేడ్ కిలారు తిరపతయ్య మూడవ వర్ధంతి సభలో ఆయన మాట్లాడుతూ.. రైతాంగ సమస్యలపై తిరపయ్య రాజీ లేని పోరాటాలు చేశారని కొనియాడారు. సీతారామ ప్రాజెక్టు నీటిని పాలేరులో కలపడం ద్వారానే నియోజకవర్గంలోని భూములకు నీటి సమస్య తీరుతుందన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సమస్యలను విస్మరిస్తున్నాయని ఆరోపించారు. పంటలకు గిట్టుబాటు ధరల కల్పించే విధంగా స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించినా ఆచరణలో అమలు చేయడం లేదన్నారు. సీపీఎం రాష్ట్ర, జిల్లా నాయకులు పొన్నం వెంకటేశ్వరరావు, చింతలచెర్వు కోటేశ్వరరావు, మడిపల్లి గోపాలరావు, కిలారు సురేష్, దొండపాటి నాగేశ్వరరావు, పాపినేని రాంనర్సయ్య, తుళ్లూరి రమేష్ పాల్గొన్నారు.

పారిశుధ్య నివారణపై ప్రత్యేక చర్యలు

- కమిషనర్ సంపంత్ కుమార్

కల్లూరు, జూలై 2 (ఆంధ్రజ్యోతి) కల్లూరు మునిసిపాలిటీ పరిధిలో వర్షాకాల సీజన్ దృష్ట్యా పారిశుధ్య నివారణపై ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు మునిసిపాలిటీ కమిషనర్ సంపత్‌కుమార్ చెప్పారు. బుధవారం స్థానిక మునిసిపాలిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాలు ప్రారంభం దృష్ట్యా సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని దీంతో ముందస్తుగా జనావాస ప్రాంతాల్లో చేత్తచేదారం లేకుండ చేయడం, మురుగు కాల్వల్లో పూడకి తీత, నీరు నిల్వలేకుండ చేయటానికి పూడిక తీయటం వంటి పనులు చేయనున్నట్లు కమిషనర్ వివరించారు. ఇంకాను బహిరంగంగా ఖాళీగా ఉన్న స్థలాల్లో నీరునిల్వ ఉండడం, చేత్తచేదారం పేరుకొని మురికి కూపాలుగా మారిన వాటిని గుర్తించి వాటిపై తగిన చర్యల నిమిత్తం స్థల యాజమానులకు నోటిసులు అందజేయడం జరుగుతుందని ఆయన విలేకరులకు తెలిపారు. నోటిసులు అందుకున్న స్థల యాజమానులు తగిన విధంగా స్పందించనిచో వారిపై మునిసిపాలిటీ చట్టం ప్రకారం తగిన చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు. ఇంకాను దోమల నిరవాణకు ప్రత్యేకంగా సాయింత్రం వేళ్లలో ఫాగింగ్ చేయనున్నట్లు కమిషనర్ చెప్పారు.

గ్రీన్‌ఫీల్డ్ హైవే సర్వీస్ రోడ్డులో రాకపోకలకు అనుమతి ఇవ్వాలి

వైరా, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం-దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవే సర్వీస్ రోడ్డులో రైతుల రాకపోకలకు అనుమతి ఇవ్వాలని కోరుతూ బుధవారం గ్రీన్‌ఫీల్డ్ హైవే ప్రాజెక్టు డైరెక్టర్‌కు రైతులు ఒక వినతి పత్రం సమర్పించారు. మండలంలోని గండగలపాడు, సోమవరం గ్రామాల రైతులు ఖమ్మం వెళ్లి గ్రీన్‌ఫీల్డ్ హైవే ప్రాజెక్టు డైరెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. గండగలపాడు నుంచి వైరా నది వైపు, సోమవరం వైపు రైతుల రాకపోకలకు అనుమతించాలని ఆవినతిపత్రంలో కోరారు. రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, నాయకులు మల్లెంపాటి రామారావు, బొల్లేపోగు శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, కామినేని రవి, చిత్తారు మురళీ, పుచ్చకాయల రామయ్య పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

మధిర రూరల్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ఈనెల 9న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని అఖిలపక్షం నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక బోడేపూడి భవన్‌లో సీపీఐ నాయకుడు బెజవాడ రవిబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో అఖిలపక్షం నాయకులు పాల్గొని ప్రసంగించారు. కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు, పేద ప్రజల డిమాండ్ల సాధన కోసం జరుగనున్న సమ్మెలో ప్రజలంతా పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. ఈనెల ఏడోతేదీన 200ద్విచక్రవాహనాలతో సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ ర్యాలీ నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. సమావేశంలో అఖిలపక్షం నాయకులు మందా సైదులు, మార్నేడి పుల్లారావు, పూట్ల కొండలరావు, షేక్.రహీం, పడకంటి మురళీ, ప్రకాశరావు, సత్యనారాయణ, రాధాకృష్ణ, నర్సింహారావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.